MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి: 20 సంచిక: 3 రంగారెడ్డి నవంబర్ 2021 పేజీలు : 36 వెల : రూ. 10/-

## చిత్తూరు జిల్లాలో ఎఫ్ పి ఓల నిర్వహణపై సి ఎస్ సమీక్ష!





సిబ్బందితో , భాగస్వామ్య ప్రతినిధులతో సమీక్ష .... వాటాదారులకు షేర్ సర్టిఫికెట్ల అందజేత



హైదరాబాద్‌లోని ఏపిమాస్ ప్రధానకార్యాలయంలో 6 రోజులపాటు జాతీయస్థాయి శిక్షకులకు శిక్షణ కార్యక్రమం




హైదరాబాద్‌లోని ఏపిమాస్ ప్రధానకార్యాలయంలో బతుకమ్మ వేడుక





బీహార్ రాజధాని పాట్నాలో 5 రోజులపాటు జాతీయస్థాయి శిక్షకులకు శిక్షణ కార్యక్రమం ... పాల్గొన్న ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల అభ్యర్థులు



नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
మరుగుదొడ్డి ఉపయోగించడం వల్ల మీకు కలిగే ప్రయోజనాలు:
• మీ ఇంటిలో పరిశుభ్రత ఉంటుంది • వివిధ జబ్బులకు దూరంగా ఉంటారు
• ఆరోగ్యకరమైన మరియు పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుంది
• పరిశుభ్రంగా ఉంటారు మరియు కరోనాను దూరంగా పారదోలతారు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత

సంపుటి 20 సంచిక 3




సంపాదకీయం

## నాయకత్వం !

**చి**రుప్రాయంలో పిల్లలు తడబడుతూ, తప్పటడుగులు వేస్తారు.అవి చూసి తల్లిదండ్రులు, సన్నిహితులు మురిసిపోతారు. కారణం ఆ వయసులో అది సహజం. ముద్దు అనిపిస్తుంది. కాని అదే పిల్లలు వయసు పెరుగుతున్నా తప్పటడుగులు వేస్తే ఎబ్బెట్టుగా వుంటుంది. గతంలో ముద్దులాడినవారే మందలిస్తారు. కారణం అది ఆసహజం. తప్పటడుగులు వేసే వయసులో పెద్దలు చేయందించి చక్కగా నడవడానికి తోడ్పడతారు. అది కొంతవరకే. ఆ తర్వాత ఆ పిల్లలు తమంత తాముగా తమ కాళ్ళతో చక్కగా నడవగలగాలి. ఇది ప్రకృతి ధర్మం! కాదంటే ఆ తప్పటడుగులే చక్కదిద్దుకోలేని తప్పుటడుగులవుతాయి. వ్యక్తులకు వర్తించే ఈ సూత్రమే సంస్థలకు, వ్యవస్థలకు, సమాజానికి కూడా వర్తిస్తుంది. ఇప్పుడు వ్యవసాయరంగంలో కొత్తవెలుగులు పంచుతున్న ' రైతు ఉత్పత్తిదారుల సంస్థల ' (ఎఫ్ పి ఓ ల ) విషయమే తీసుకుంటే, అవి యిప్పుడిప్పుడే వేళ్ళూనుకుంటున్న లేబ్రాయపు సంస్థలు. కొన్ని దేశాలు, ప్రాంతాలలో అవి తగిన వయస్సువచ్చి కొంత స్థిరత్వాన్ని పొంది వుండవచ్చు. కాని మన దేశంలోని చాలా ప్రాంతాలలో, ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో యివి యింకా బాల్యావస్థలోనే వున్నాయి. తడబడుతూ, నిలబడుతూ తప్పటడుగులు వేస్తున్నాయి. ప్రోత్సాహక సంస్థల మార్గదర్శనమో, క్రియాశీల వ్యూహాత్మక నాయకత్వమో వున్న ఏ కొన్నిచోట్లనో తప్ప మిగతా ఎఫ్ పి ఓ లు కేవలం కొన్ని కార్యక్రమాలకే పరిమితమై, స్తబ్దుగా వుంటున్నాయి. నిజానికి ఎఫ్ పి ఓల కార్యకలాపాలకు ఆకాశమే హద్దు ! పరిశీలించి చూడగలిగితే, ఉపయోగించుకోగలిగితే అన్నీ అవకాశాలే ! ఎన్నో ఫలితాలను ఆశించి రైతులు వీటిలో సభ్యులుగా చేరుతారు. ఆశించిన చైతన్యం, వేగం కొరవడితే, ఫలితాలు మందగిస్తే వారు నిరాశతో నీరసిస్తారు.వ్యవసాయంలో ప్రతి అంశంలోను ఎఫ్ పి ఓల సంఘటిత కృషి ఎంతగానో ఉపయోగపడుతుంది. అనుభవాలను పంచుకోవడం, కొత్త విశేషాలను తెలుసుకోవడం, సాంకేతికతను, నవీకరణలను, నైపుణ్యాలను సంతరించుకోవడం, మేలైనదానిని అనుసరించడం, అభివృద్ధి సాధించడం ఎఫ్ పి ఓల ధ్యేయం కావాలి. పొలం సిద్ధం చేయడం నుంచి, విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారకాలు, వ్యవసాయ యంత్రాలు, ఇతర దోహదాలను ఉమ్మడిగా, తక్కువ వ్యయంతో సమకూర్చుకుని, పంటలను కాపాడుకుంటూ, నాణ్యమైన ఉత్పత్తులను సాధించడం ఒక ఎత్తయితే, పండిన పంటకు లాభదాయమైన, ప్రోత్సాహకరమైన మార్కెట్ సౌకర్యాన్ని పొందడం మరో ఎత్తు. తమ ఉత్పత్తులకు అనువుగా ఎందరో నిపుణుల తోడ్పాటును, ఫలప్రదమైన భాగస్వామ్యాలను, అనుసంధానాలను సాధించుకోవడంలోనే ఎఫ్ పి ఓల సత్తా బయటపడుతుంది. నాయకత్వ పాటవం, ముందుచూపు వెల్లడవుతుంది. తమ ఆదాయం గణనీయంగా పెరగాలని, తమ జీవన ప్రమాణాలు ఎంతగానో మెరుగుపడాలన్నదే రైతులు ఎఫ్ పి ఓలు గా సంఘటితం కావడంలోని ప్రధాన ఆశయం. ఇవి కేవలం వ్యవసాయ సంస్థలే కాదు, వ్యాపార సంస్థలు కూడా! వ్యాపార ధోరణులను వంటబట్టించుకోకుండా ఎంత పండితే అంత పండిస్తాం, ఎంతకు అమ్ముడుపోతే అంతకు అమ్ముకుంటాం అనే దానికి ఎఫ్ పి ఓల అవసరమే లేదు. ఇవి వ్యవసాయ రంగంలో ఎంతో పురోగతిని సాధించడానికి, చైతన్యాన్ని, ఉత్సాహాన్ని నింపడానికి ఏర్పాటైన సంస్థలు. ఆ సంస్థల నాయకత్వానికి, అధికారులకు, సిబ్బందికి ఆ ఉత్సాహం, ఆ వేగం, ఆ ఉరవడి , ఆ ముందుచూపు, ఆ వ్యూహాత్మక వ్యవహార శైలి కొరవడితే నష్టం కేవలం ఆ సంస్థలకే కాదు, మొత్తం వ్యవసాయ రంగానికే తీరని నష్టం! తామూ ఆ సంస్థలలో చేరి ప్రయోజనం పొందాలనుకునే ఇతర రైతుల ఆశలపై అశనిపాతం! సంస్థలను ఏర్పాటు చేయడం కాదు, వాటిని ప్రయోజనాత్మకంగా, ప్రభావోత్పాదకంగా , పారదర్శకంగా నిర్వహించడమే అసలైన సవాలు. ఆ సవాలును స్వీకరిద్దాం,విజేతలమవుదాం!

టి. చంద్రశేఖర రెడ్డి


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.Chandra Sekhar Reddy


ఎవరు ఏమి కీడు చేసినా నీ మేలు కోరుకునే ఒక మంచి స్నేహితుడు వుంటే చాలు

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు


## లోపలి పేజీలలో ....


- ఎఫ్ పి ఓల సుస్థిరతకు పంచ సూత్రాలు ! ...05
- పుట్టిన గొర్రెపిల్ల బతికితేనే.....మంద పెరుగుతుంది ...09
- తెలంగాణాలో వరి సాగు నియంత్రణ ! ...11
- సంఘటితమైతేనే సత్ఫలితాలు ...13
- కనుమరుగవుతున్న మహిళల తివాచీ కళా వైభవం! ...16
- కథ 'మాధురి' అందిస్తున్న సౌందర్య సాధనాలు ...18
- భర్త ఆరోగ్యం కోసం మారథాన్ పరుగు! ...20
- ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ మహిళలు ! ...22
- తక్కువ వడ్డీకే రుణం సమకూరే మార్గాలివే... ...23
- పాతరగడ్డితో దాణా కొరతకు చెక్ ...24
- ఇత్తడి ఉత్పత్తులతో ఊరంతా ఉపాధి ! ...25
- ఎరువులపై సబ్సిడీకి కేంద్రం ఆమోదం ...27
- మధుమేహాన్ని నియంత్రించే ములక్కాడల కూర ! ...28
- మురికివాడల బాలికలకు బామ్మ అండ! ...30
- కాసులు కురిపించే కుసుమ సాగు ! ...31
- అందాన్నే కాదు, ఆరోగ్యాన్నీ సంరక్షించే మల్లెపూలు! ...32
- ఓఆర్ఎస్ కొంటున్నారా ? బహుపరాక్ ! ...33
- కనే కష్టమేకాదు, కుటుంబ నియంత్రణా అమ్మలకే ...34


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**



మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


**నీ మిత్రుల భావోద్రేకాలతో ఆడుకోకు, ఆట గెలుస్తావేమో కాని శాశ్వతంగా వారికి దూరమవుతావు**

# ఎఫ్ పి ఓల సుస్థిరతకు పంచ సూత్రాలు !

– ఎస్. ప్రహల్లాద

ఏపిమాస్ (మహిళా అభివృద్ధి సొసైటీ) చిన్న, సన్నకారు రైతుల అభివృద్దే ధ్యేయంగా, వారితో రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేసి, రైతులకు కావలసిన వివిధ రకాల కార్యక్రమాలను తమంతట తామే చేపట్టే విధంగా వివిధ



రకాల చర్యలు చేపట్టింది. జర్మనీదేశ హరిత వినూత్న కేంద్ర పథక సహాయంతోను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యాన శాఖ వారి తోడ్పాటుతోను, కేంద్ర ప్రభుత్వ రైతు సంక్షేమ పథకంలో భాగంగాను, నాబార్డు కార్యక్రమంలో భాగంగాను చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం 14 రైతు ఉత్పత్తిదారు సంస్థలను (ఎఫ్ పి ఓ లను) ఏర్పాటుచేసి, వాటి ద్వారా వివిధ రకాల వ్యాపార కార్యక్రమాలను నిర్వహింపజేస్తున్నది. త్వరలో జిల్లాలో మొత్తం 23 ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేయడానికి సంకల్పించింది.

జిల్లా స్థాయిలో రైతు ఉత్పత్తిదారు సంస్థలతో ఒక సమాఖ్యను ఏర్పాటు చేసి, దానిని 'ఎం–టమాట' రైతు ఉత్పత్తిదారుల కంపెనీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసి, దాని ద్వారా వివిధ రకాల వ్యాపార కార్యక్రమాలను 'సమిష్టి కొనుగోలు' విధానంలో చేపట్టి సభ్య రైతులకు తక్కువ ధరలకు అందజేయడం జరుగుతున్నది.

ప్రతి ఎఫ్ పి ఓ కార్యవర్గానికి తోడ్పాటు అందించుటకు ఒక ముఖ్య కార్య నిర్వహణ అధికారిని నియమించి వారికి వివిధ రకాల శిక్షణలు, క్షేత్ర సందర్శనలు నిర్వహిస్తున్నారు. ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ తమ సభ్యరైతులకు పశువుల దాణా, వివిధ రకాల ఎరువులు, క్రిమి సంహారక మందులు, వ్యవసాయ యంత్ర పరికరాలు మొదలగు వివిధ రకాల ఉత్పాదకాలను సరసమైన ధరలకు అందిస్తున్నది. వీటితో పాటు రైతులు పండించే వివిధ రకాల కూరగాయలకు మార్కెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నది. ప్రస్తుతం ఎఫ్.పి.ఓ సి.ఈ.ఓ లకు మరింత తోడ్పాటు అందిందించడం కోసం రైతు ఉత్పత్తిదారు సంస్థ కార్యవర్గ సభ్యులను చైతన్య పరుచుటకు వివిధ స్థాయిలలో ఏపిమాస్ సిబ్బందిని నియమించి కార్యక్రమాలను క్రోడీకరిస్తున్నది.

ప్రస్తుతానికి ఎఫ్ పి ఓ ల నిర్వహణ వ్యయాలను, అంటే సి.ఈ.ఓ వేతనం, కార్యాలయం అద్దె, కరెంటు ఛార్జీలు మొదలైనవాటిని ఏపిమాస్ భరిస్తున్నన్నది. అయితే కొద్దికాలం తర్వాత ఇతరులపై ఆధారపడకుండా రైతు ఉత్పత్తిదారు



సంస్థలే వాటి నిర్వహణ వ్యయాలను స్వంతంగా సంపాదించుకొని, స్వయంగా భరించే విధంగా ఎదిగి సుస్థిరత దిశగా ముందుకు సాగాలని ఏపిమాస్ ఆశిస్తున్నది.

అందువలననే ఏపిమాస్ సి ఇ ఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సి.ఎస్.రెడ్డి రాష్ట్రంలో వివిధ రైతు ఉత్పత్తిదారు సంస్థలను

ప్రపంచానికి అసలు సమస్య హింసోన్మాదులతో కాదు, సాధు స్వభావం పేరుతో నోరు మెదపకుండా చూసేవారితో

సందర్శించి, వాటి కార్యవర్గ సభ్యులతో చర్చించి సంస్థల సుస్థిరతకు పంచ సూత్రాలను సిఫారసు చేశారు. ఈ పంచ సూత్రాలను సక్రమంగా పాటించే సంస్థలు భవిష్యత్‌లో సుస్థిరాభివృద్ధి సాధిస్తాయనడంలో సందేహం లేదు. **ఆ పంచ సూత్రాలు యివి:**

**1.** సభ్య రైతులు ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థను వ్యాపార సంస్థగా భావించి వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టాలి. వ్యాపారం అనేది లాభ నష్టాలు బేరీజు వేసుకొని సాగుతుంది. అదేవిధంగా ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ కూడా రైతుకు సేవలు అందించడంతో పాటు, లాభాపేక్షతో కూడా పని చేసినప్పుడే భవిష్యత్‌లో సుస్థిరత సాధిస్తుంది.

**2.** ఎఫ్ పి ఓ తాను చేపట్టే అన్ని కార్యక్రమాలలో వివిధ ముఖ్య భాగస్వామ్యులను కలుపుకొని ముందుకు సాగాలి. ఎఫ్.పి.ఓ కార్యవర్గ సభ్యులు, సాధారణ సభ్యులు, రైతుల అభివృద్ధి కొరకు పనిచేసే ప్రభుత్వ విభాగాల అధికారులు, వివిధ రైతు మహిళా సమాఖ్యలు, వర్తకులు, కంపెనీలు, బ్యాంకులు, విత్త సంస్థలు, విద్యాసంస్థల ప్రతినిధులు మొదలైన వారందరు ఎఫ్ పి ఓ భాగస్వాములే.

**3. సమాచార బ్యాంక్ నిర్వహణ :**

రైతు ఉత్పత్తిదారు సంస్థకు సంబంధించిన సమాచారాన్ని అంటే, సభ్యుల వివరాలు, మండలంలో చేపట్టిన వివిధ రకాల విలువ గొలుసు కార్యక్రమాలు, మార్కెటింగ్, వాతావరణ తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు తాజాగా నిర్వహించాలి. ఈ సమాచారం రైతుల అభివృద్ధి కొరకు చేపట్టవలసిన కార్యక్రమాల రూపకల్పనలో ఎంతో ఉపయోగపడుతుంది

**4. మార్కెటింగ్ కార్య క్రమాలు చేపట్టడం :**

ఎఫ్‌పిఓ స్థాయిలో వివిధ రకాల వస్తువులు, పరికరాలు, ఉత్పత్తుల కొనుగోళ్ళు, అమ్మకాల మార్కెటింగ్ కార్యక్రమాలను చేపట్టి సంస్థకు లాభాలు చేకూర్చడానికి కృషి చేయాలి.

**5. నిర్ణీత చట్టబద్ధ కార్యక్రమాలనిర్వహణ :**

ఎఫ్ పి ఓ స్థాయిలో నిర్వహించవలసిన నిర్ణీత చట్టబద్ధ కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలి. నిర్ణీత పుస్తక నిర్వహణ, అంతర్గత ఆడిట్, ఛార్టర్డ్ అకౌంటెంట్ ద్వారా బహిర్గత ఆడిట్ నిర్వహణ, వార్షిక మహాసభ నిర్వహణ, కార్యవర్గ సభ్యుల, పదాధికారుల ఎంపిక, వార్షిక రిటర్నుల సమర్పణ మొదలగునవి సమయానికి పూర్తి చేయాలి. ప్రతి నెల జిఎస్‌టి రిటర్నులు సమర్పించాలి. వార్షిక మహాసభ నిర్ణీత పద్ధతి ప్రకారం నిర్వహించాలి. ప్రతి మహాసభలో కూడా ఆ ఆర్థిక సంవత్సరంలో ఎఫ్ పి ఓ సాధించిన ప్రగతిని నివేదిక రూపంలో ముద్రించి సభ్యులకందరికి పంపిణీ చేయాలి.



పైన తెలిపిన పంచ సూత్రాలతో పాటు రైతు ఉత్పత్తిదారు సంస్థ కార్యవర్గ సభ్యులకు ఎప్పటికప్పుడు శిక్షణలు, క్షేత్ర సందర్శనలు నిర్వహించాలి. ప్రతి సంవత్సరం నిర్వహించే వార్షిక మహాసభలో నూతనంగా ఎంపిక అయ్యే కార్యసభ్యులకు నిరంతరంగా శిక్షణలు కొనసాగించాలి. అంతేగాక సభ్యుల అవసరాలకు అనుగుణంగా ఎఫ్ పి ఓ సిఈఓలు వివిధ రకాల వ్యాపార అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ఎఫ్ పి ఓ ల సుస్థిరతకు దోహదపడతారని ఆశిద్దాం. ■

**నీ శక్తి సామర్థ్యాలను చిన్నబుచ్చేవారే నీ పురోగతికి కారకులు, వారి వల్లనే నీ సత్తా మెరుగవుతుంది**

# వ్యవసాయ సంస్కరణలు, వరమా ? శాపమా ?

– జె వి క్రిష్ణమూర్తి

**కేం**ద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో సంస్కరణల పేరుతో తీసుకువచ్చిన మూడు వ్యవసాయ శాసనాలు ఎంతగానో వివాదాస్పదమవుతున్నాయి. అటు ప్రభుత్వము, ఇటు రైతులు ఎవరి వాదనలకు వారే పరిమితమవుతూ, రెండవ వారు చెప్పేది వినిపించుకోవడానికి, మనసుకు ఎక్కించుకోవడానికి సుముఖత చూపకపోతుండడంతో ఒక ఎడతెగని ప్రతిష్టంభన ఏర్పడింది. రైతునేతల పిలుపుతో ఇటీవల దేశవ్యాప్త బంద్ కూడా జరిగింది. ఫలితం, పర్యవసానం ఏమిటంటే మళ్ళీ ఎక్కడవేసిన గొంగడి అక్కడే వుండడం. బంద్ సఫలమైంది, విఫలమైంది అనే విరుద్ధ ప్రకటనలు తప్ప ఈ ప్రతిష్టంభన వల్ల కలుగుతున్న తీవ్ర నష్టాన్ని , ఏర్పడిన సామాజిక కాలుష్యాన్ని ఎవరూ పట్టించుకుంటున్న దాఖలాలు లేవు.

నిజానికి ఈ సంస్కరణలకు అనుకూలంగా, ప్రతికూలంగా ప్రకటనలు చేస్తున్న వారిలో చాలామందికి ఆ శాసనాల పూర్తి స్వరూపస్వభావాలు, మేలుకీళ్ళ గురించి సరైన , లోతైన అవగాహన వున్నట్టు కనిపించదు. నిపుణులు సైతం రెండు శిబిరాలుగా చీలిపోయినట్టు అనిపిస్తుంది. లేకుంటే కొందరు నిపుణులు ఎంతగానో మేలు చేస్తుందనే అంశమే మరి కొందరు నిపుణులకు ఘోర అపకారకారిగా కనిపించడమేమిటి? మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారగలిగితేనే ప్రగతి. లేకుంటే తిరోగతే కదా! 'మార్పు జీవన సూత్రం' అని మన మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత తత్వవేత్త, భారతరత్న కీర్తిశేషులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేర్కొన్న విషయం గమనార్హం. కాలంతో పాటు, పరిస్థితులకు అనుగుణంగా, అనువైన మార్పును ఆహ్వానించాలి.

నిజమే ఎడ్లబండి మంచి కాలుష్య రహిత వాహనమే. కాని ప్రచండవేగాన్ని సంతరించుకున్న నేటి ప్రపంచంలో ఆ మంచి వాహనం ఎంతవరకు మనకు ఉపయోగపడుతుందో ఆలోచించాలి కదా! ఏ సంస్కరణ అయినా, ఏ పథకమైనా సంపూర్ణంగా లోపరహితమైంది అంటూ ఏదీ వుండదు. అనుమానాలు వుండడం కూడా సహజమే. అనుమానాలను రేకెత్తించే అంశాల తీవ్రతకంటె అనుమానాలను నివృత్తి చేయడంలో ప్రభుత్వ వైఫల్యమే ప్రధానలోపమని పలువురు నిపుణులు భావిస్తున్నారు. ఉభయవర్గాలు వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలను పరిశీలిస్తే ఆ భావన సరైనదేననిపిస్తుంది. అలాంటి అభిప్రాయాలను కొన్నిటిని చూద్దాం.

**<u>రైతులకు ఎంతో మేలు:</u>** రైతులు యిప్పుడు దేశంలో ఎక్కడైనా , తగినట్టు బేరమాడి తమ వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. దళారీలకు తావులేదు. ఇప్పటివరకు వ్యాపారులు పొందుతున్న అధిక లాభశాతాన్ని యిప్పుడు రైతులు పొందవచ్చు. కేవలం కార్పొరేట్ సంస్థలే కొనుగోలుచేస్తాయని, కొనుగోలుదారులు వేరెవ్వరూ వుండరనుకోవడం పొరపాటు. – *ప్రొఫెసర్ దేశ్‌పాండే... సామాజిక, ఆర్థిక పరిణామ సంస్థ మాజీ డైరెక్టర్, వ్యవసాయాభివృద్ధి, గ్రామీణ పరివర్తన కేంద్రం మాజీ అధినేత*

**<u>రైతుకు నష్టమే లేదు ... లాభమే:</u>** రైతుకు అంతా లాభమే తప్ప నష్టమే లేదు. ఇప్పటివరకు రైతుల ఉత్పత్తులమీద ఎంతగానో సొమ్ముచేసుకుంటున్న కమిషన్ ఏజెంట్లకు, మార్కెట్ యార్డులలో అమ్మకాలపై సుంకాలు వసూలుచేస్తున్న రాష్ట్రప్రభుత్వాలకు మాత్రమే ఆదాయం తగ్గుతుంది. – *అరవింద్ పనగారియా ... నీతి అయోగ్ మాజీ వైస్ ఛైర్మన్*

**సమాచార లోపం:** కొత్త వ్యవసాయ చట్టాలు రైతులకు మేలుచేస్తాయి. సమాచారలోపం, అపోహల వ్యాప్తి వల్లనే యిదంతా – *అశోక్ గులాటి ... ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి మాజీ సభ్యుడు*

**నచ్చజెప్పండి :** రైతులకు నచ్చజెప్పండి. వారిని తప్పుత్రోవ పట్టిస్తున్నారు – స్వామినాథన్ ఎస్ అంక్లేసరియా అయ్యర్ ... టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక కాలమిస్ట్

వ్యూహంపైనే భిన్నాభిప్రాయం: సంస్కరణలు వుండి

**స్నేహమే నీ బలహీనత అయితే, నిన్ను మించిన బలవంతుడు వేరొకడు వుండడు**

తీరాల్సిందే, అయితే ఇందుకు అనుసరించవలసిన వ్యూహంపైనే వివాదమంతా – *ఆండీ ముఖర్జీ ... బ్లూమ్‌బెర్గ్ ఒపీనియన్ కాలమిస్ట్*

**భారతీయ కిసాన్ యూనియన్ ప్రతి వాదం**

కార్పొరేట్ సంస్థలు భారతదేశంలో భారీ ఆహార ధాన్యాల మార్కెట్‌పై దృష్టి పెట్టాయి. కానీ వాటికి కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. వాటిని మోడీ ప్రభుత్వం చాకచక్యంగా పరిష్కరించింది

**సమస్య 1:** రైతుల నుండి ఆహార ధాన్యాలను కొనుగోలు చేయడానికి రాష్ట్రాలు వేర్వేరు నియమాలు , నిబంధనలను కలిగి ఉన్నాయి. పన్నుల విధానం వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా ఉంది. దేశ వ్యాప్తంగా ఇన్ని రాష్ట్రాల్లో లాబీయింగ్ నిర్వహించడం కార్పొరేట్లకు కష్టంగా ఉంది.

**మోడీ పరిష్కారం:** భారతదేశం ఫెడరల్ వ్యవస్థ. వ్యవసాయం రాష్ట్రాల పరిధి లోనిది. కేంద్రం వ్యవసాయ సంస్కరణల పేరుతో తీసుకొచ్చిన నాలుగు నల్ల చట్టాలతో వ్యవసాయ రంగాన్ని కేంద్రం తన నియంత్రణలోకి తీసుకుంది. మొత్తం దేశం కోసం ఒక చట్టం కేంద్రం చేసింది. కార్పొరేట్ సంస్థలు సంతోషించాయి.

**సమస్య 2:** కార్పొరేట్ సంస్థలు పెద్దమొత్తంలో పంటలను కొనుగోలు చేసి వాటిని నిల్వ చేయాలనుకుంటాయి. అయితే నిత్యావసర వస్తువుల చట్టం దానికి అంగీకరించదు. పంటలను ఎక్కువ కాలం నిల్వ చేయకుండా నిరోధిస్తుంది.

**మోడీ పరిష్కారం:** నిత్యావసరాలచట్టాన్ని రద్దుచేసింది.దీంతో ఆహార ధాన్యాలు,నూనె గింజలు,బంగాళాదుంపలు, ఉల్లిపాయలు తదితర నిత్యావసరాల సరుకులు ఎన్నైనా,ఎంతకాలమైనా నిల్వ చేసుకొని,కృత్రిమ కొరత సృష్టించి లాభం పొందవచ్చు. కార్పొరేట్లకు మళ్లీ సంతోషం.

**సమస్య 3:** రైతులు ఏ రకమైన పంటను పండిస్తారో అంచనా వేయడం కష్టం.

**మోడీ పరిష్కారం:** కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని రంగంలోకి తెచ్చింది., అక్కడ కార్పొరేట్‌లు డిమాండ్ ఉన్న పంటను పండించమని చెబుతూ రైతులకు ప్రారంభంలో అధిక ఆదాయం ఎరను వేస్తాయి. తర్వాతకాలంలో అధికపెట్టుబడుల కారణంగా రైతులు భూములను కార్పొరేట్లకే తెగనమ్ముకుని,వారి భూముల్లో వారే కూలీలుగా మారతారు. కార్పొరేట్లకు మళ్లీ సంతోషం.

**సమస్య 4:** జరుగుతున్న, మోసాన్ని గ్రహించి కార్పొరేట్లకు వ్యతిరేకంగా రైతులు కోర్టుకు వెళితే కార్పొరేట్ సంస్థలకు చౌకగా భూములు దక్కే ప్రక్రియ ఆలస్యం కావడం,చివరకు భూములను రైతులకే వదిలేసే పరిస్థితి రావడం వంటివి జరిగితే మొత్తం బెడిసికొడుతుంది.

**మోడీ పరిష్కారం :** ఫాం కాంట్రాక్టర్ మరియు రైతులకు మధ్య వివాదాలను పరిష్కరించుకోవడానికి తీసుకొచ్చిన చట్టంతో రైతులు రెగ్యులర్ కోర్టులకు వెళ్ళే వీలు లేకుండా చేసాడు. వారు కలెక్టర్ మరియు ఆర్డీవో ల వద్ద మాత్రమే ఫిర్యాదు చేయాలి ( న్యాయమూర్తులుగా వ్యవహరించే ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ విధానాలనే అమలుచేస్తారు,అక్కడ రైతు సమస్యలు పరిష్కారమౌతాయని ఎవరికీ నమ్మకాలుండవు.). కార్పోరేట్ శక్తులు ప్రభుత్వ అండతో న్యాయాన్ని వారికి అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది.దీంతో మళ్లీ సంతోషించారు. వాస్తవం ఇలా ఉండగా బిల్లులు రైతుల పక్షాన ఉన్నాయని మోదీ చెప్పడం. తన క్యాబినెట్ తో సహా ప్రతి భారతీయుడిని ఎలా ఫూల్ చేస్తున్నాడో గమనించండి ......

ఈ విరుద్ధ వాదాల పరంపరలో కొన్ని సత్యాలు, కొన్ని అర్ధ సత్యాలు, మరికొన్ని అసత్యాలు వుండవచ్చు. హంస పాలను, నీళ్ళను వేరుచేసినట్టు చూసేవారికే నిఖార్సయిన నిజాలు తెలుస్తాయేమో? మొత్తంమీద చాలామంది నిపుణులు, ఉభయ శ్రేయోభిలాషులు అభిప్రాయపడుతున్నట్టు కొత్తశాసనాలు చేసే మేలేమిటో రైతులకు నచ్చజెప్పడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందనేది కాదనలేని నిజం. ఈ శాసనాలతో పన్నురూపంలో తమకు వచ్చే ఆదాయానికి కూడా గండిపడనుండడం, తమ అధికార పరిధిలోకి కేంద్రశాసనాలు చొరబడుతుండడం నచ్చని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమకెందుకని తమాషా చూస్తుండడం మరొక ప్రతికూలాంశం. రైతులతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా నచ్చజెప్పేపని ఎంతత్వరగా జరిగితే అంతమేలు. ■

**చిరునవ్వుకు అర్థం విచారం లేకపోవడం కాదు, విచారాన్ని ఎలా నిగ్రహించుకోవాలో తెలియడం**

# పుట్టిన గొర్రెపిల్ల బతికితేనే....మంద పెరుగుతుంది

**– డాక్టర్ ఎం. భార్గవి**

**చి**త్తూరుజిల్లాలో పశుపోషణకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అంతే ప్రాధాన్యతను గొర్రెల పెంపకానికి కాపారులు, యజమానులు ఇస్తున్నారు. చాలామంది గొర్రెల పెంపకాన్ని జీవనాధారం చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. కరువు పరిస్థితుల్లో గొర్రెలు అటు కాపరులను, ఇటు యజమానులను ఆదుకుంటున్నాయి. అయితే మంద బాగా వృద్ధి చెంది లాభాలు రావాలంటే వాటిలో గొర్రెపిల్లల సంరక్షణ జాగ్రత్తగా చేపట్టి, వాటి మరణాలు తగ్గించుకుంటే మంచి లాభాలు వస్తాయి. గొర్రె



పిల్లల మరణాలను తగ్గించుకుంటేనే మంద జీవాలతో కళకళలాడుతుంది. గొర్రెలు చూడి కట్టినప్పటి నుంచే వాటిపై శ్రద్ధ చూపాలి. గొర్రెపిల్లల పెంపకంలో సరైన మెళకువలు పాటిస్తే మరణాలు అరికట్టవచ్చు. గొర్రె పిల్లల పెంపకం, వాటికిచ్చే ఆహారం, వసతి, ఆరోగ్యం, వ్యాధి నిరోధకతకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు.....సూచనలు ఏమిటో తెలుసుకుందాం.

**చూడి గొర్రెల సంరక్షణ ఇలా...**

గొర్రెపిల్ల పుట్టిన ఏడాది లోపు చూడికి (పిల్లలు కనడానికి) వస్తుంది. గొర్రె చూలుతో ఉన్నప్పుడు అంటే రెండున్నర నెలలు చూడి సమయంలో 'చిటుక వ్యాధి' నివారణ టీకాలు వేయించాలి. దీనివల్ల జీవాలు ఈనిన తర్వాత పిల్లలకు నరాల సంబంధిత జబ్బులు రాకుండా ఉంటాయి. గొర్రెలు చూడితో ఉన్నప్పుడు నట్టల నివారణ మందు తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది. చూడి గొర్రెలు ఈనే సమయానికి వాటిని మంద నుంచి వేరు చేసి దుమ్ము ధూళి లేకుండా గాలి,వెలుతురు బాగా తగిలే కొట్టాల్లో ఉంచాలి. చూడి గొర్రెలకు బయటి మేత తినిపిస్తూ మేపుకుంటూ రోజుకు రెండు వందల గ్రాముల చొప్పున దాణా ఇవ్వగలిగితే పిల్లలు ఆరోగ్యంగా ఉండి మంచి బరువుతో పుడతాయి. ఈనిన తరువాత గాలికుంటు వ్యాధి బారిన పడిన తల్లిగొర్రె పాలు దాని పిల్లలకు తాగిస్తే ఆ పిల్లలు 'మైయోకార్డిటిస్' (గుండె నరాలకు సంబంధించిన) వ్యాధికి గురై చనిపోతాయి. కావున కేవలం ఆరోగ్యంగా ఉన్న తల్లిగొర్రె పాలను మాత్రమే, కాచి చల్లార్చి తాగించాలి. ఈ వ్యాధి సోకిన గొర్రె పిల్ల చనిపోయే ముందు పెద్దగా అరుస్తుంది.

**విత్తన పొట్టేలు విషయంలో జాగ్రత్తలు ...**

గొర్రె పిల్లలలో మరణాల శాతం తగ్గి ఆరోగ్యంగా ఉండాలంటే మందలోని గొర్రెలను దాటించేందుకు (సంయోగం) ఉపయోగించే విత్తన పొట్టేలు ఆరోగ్యంగా

**అవకాశాలు సూర్యోదయం లాంటివి, ఏ రోజు జాప్యం చేస్తే ఆ రోజుకు ఇక అంతే, చేయిజారినట్టే !**

చురుగ్గా ఉండి మంచి లైంగిక శక్తి సామర్థ్యాలను కలిగి ఉండాలి. ఒకే మందకు చెందిన విత్తన పొట్టేలును మందలోని గొర్రెలను దాటించే ప్రయత్నం చేస్తే పుట్టే పిల్లలు అనారోగ్యంగాను, తక్కువ బరువుతోను, పుట్టిన తరువాత ఎదుగుదల సరిగ్గా లేకుండా చనిపోవడం జరుగుతుంది. విత్తన పొట్టేలుపైనే మంద పెరుగుదల 50% వరకు ఆధారపడి ఉంటుంది కనుక కాపరులుగాని,



యజమానులుగాని విత్తన పొట్టేలును సాధ్యమైనంతవరకు బయటి మంద నుంచి తీసుకుంటే బలమైన గొర్రెలు పుడతాయి, ఆరోగ్యంగా ఉంటాయి.

**గొర్రె పిల్లలకు అందించే ఆహారం ...**

పుట్టిన పిల్లలు పదిహేను రోజుల తర్వాత నుంచి లేత గడ్డి పోగులను తినడం ప్రారంభిస్తాయి. పదిహేను రోజుల నుంచి రెండు నెలల వయస్సు వచ్చేవరకు రోజుకు 8 గంటలకోసారి తల్లి పాలు తాగించాలి. ఆ తరువాత మూడు నెలల వయస్సు వచ్చేవరకు 12 గంటలకు ఒకసారి తల్లి పాలు తాగేలా చూడాలి. 90 రోజుల తరువాత తల్లి గొర్రె నుంచి పిల్లను వేరుచేసి మేపునకు తీసుకుపోవాలి. మేలు రకమైన జొన్న, మొక్కజొన్ననుగాని, సుబాబుల్, అవిసె, వేప ఆకులను మేపడం వలన త్వరగా ఎదిగి బరువు బాగా వస్తాయి. మంచి శుభ్రమైన నీటిని అందుబాటులో ఉంచాలి. చిరు ధాన్యాలు తక్కువకు దొరుకుతాయి కనుక ఆ గింజలను పిండి చేయించి ఉప్పుతో కలిపి కొద్ది కొద్దిగా ఉదయం, సాయంత్రం వేళల్లో తినిపిస్తే మేత బాగా మేసి బలిష్టంగా తయారవుతాయి.

**గొర్రె పిల్లల సంరక్షణ, యాజమాన్యం.....**

పుట్టిన ప్రతి గొర్రెపిల్లను సంరక్షించుకుంటే కాపరులకు, యజమానులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది.

**పాటించవలసిన విధానాలు ......**

- గొర్రె పిల్ల పుట్టిన వెంటనే ఇతర జీవాల్లో ఉంచకుండా వేరుగా ఉంచాలి.
- పుట్టిన పిల్లలను విడివిడిగా స్థలం ఏర్పాటు చేసుకుని ఉంచాలి.
- గొర్రె పిల్లలను చలి, ఎండ, గాలుల నుంచి కాపాడుకోవాలి. కొట్టాల పైకప్పు గాలి, వెలుతురు బాగా రావడానికి అనుకూలంగా ఉండేలా చూసుకోవాలి.
- గొర్రె పిల్ల పుట్టిన వెంటనే ముక్కు రంధ్రాలలో గల జిగురు పదార్థాన్ని తీసి వేయాలి.
- పుట్టిన వెంటనే గొర్రె పిల్లల బొడ్డు నరాన్ని రెండు మూడు అంగుళాలు ఉంచి శుభ్రమైన బ్లేడుతో కత్తిరించి 'టింక్చర్ అయోడిన్' పూయాలి.
- పుట్టిన 15 నిమిషాల లోపునే పిల్లలను తల్లి గొర్రె దగ్గరకు చేర్చి ముర్రు పాలను తాగించాలి. ఇలా మూడు నాలుగు రోజులు తాగించాలి.

**వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి......**

- గొర్రె పిల్లలలో మరణాల సంఖ్య తగ్గించాలంటే వ్యాధి నిరోధక శక్తి కోసం టీకాలు తప్పక వేయించాలి.
- నాల్గవ నెలలో పీపీఆర్ (పారుడు వ్యాధి ) నిరోధక టీకాలు, ఐదవ నెలలో 'చిటుక వ్యాధి' నివారణ టీకాలు, ఆరవ నెలలో 'బొబ్బదాలు' వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. ఇలా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటే గొర్రె పిల్లలను సంరక్షించుకోవచ్చు.

■

**నీవు వెలిగిపోతుంటే అందరూ నీ వెంట నడిచేవారే, నీ చీకటి రోజులలో ఆఖరుకు నీ నీడకూడా నీ వెంట రాదు**

# తెలంగాణాలో వరి సాగు నియంత్రణ !

**వ**రి సాగుపై సర్కారు ఉక్కుపాదం మోపుతోంది. ఈ యాసంగిలో రైతులు వరి పంటను సాగు చేయకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తోంది. యాసంగిలో సాగు విస్తీర్ణాన్ని కూడా ఇంతకు ముందెన్నడూ లేనివిధంగా గణనీయంగా తగ్గించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ముందుగా విత్తన డీలర్లకు హెచ్చరికలు పంపుతోంది. వినకపోతే వారి షాపులను సీజ్ చేస్తామని బెదిరిస్తోంది. మొత్తంగా వరి సాగవ్వకూడదన్న పట్టుదలతో ప్రభుత్వం ఉంది. ఇందుకు సంబంధించి అన్ని జిల్లాల కలెక్టర్లకు అంతర్గతంగా ఆదేశాలు జారీ చేసింది. రైతులను ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది. ఓవైపు పుష్కలంగా నీరు, మరోవైపు కరెంటు అందుబాటులో ఉండడంతో రైతులు వరిసాగు ఎక్కువగా చేస్తున్నారు. దీంతో విస్తీర్ణం బాగా పెరిగి.. కోట్ల టన్నుల్లో దిగుబడి వస్తోంది.

గత ఏడాది యాసంగిలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) దేశవ్యాప్తంగా సేకరించిన బియ్యంలో 56శాతం తెలంగాణ నుంచి వచ్చిందే ఉంది. అయితే యాసంగిలో ఎక్కువగా దొడ్డు రకం వరిసాగు జరుగుతుంది. ఈ ధాన్యం నుంచి వచ్చే ఉప్పుడు బియ్యం వాడకం ఈసారి ఇతర రాష్ట్రాల్లో తగ్గింది. అక్కడి అవసరాల మేరకు ఆయా రాష్ట్రాల్లోనూ వాటి ఉత్పత్తి పెరిగింది. దాంతో ఈసారి ఉప్పుడు బియ్యం కొనుగోలు చేయలేమని ఎఫ్‌సీఐ తెలిపింది. ఉప్పుడు బియ్యం స్థానంలో ముడి బియ్యం కావాలని అడుగుతోంది. ప్రభుత్వ నిర్ణయానికి ఇదే కారణమని తెలుస్తోంది.

**ఆర్థికంగా భారమవుతుందనే!**

సాధారణంగా రైతులు తాము పండించిన పంటను కొంత మేరకు పొలాల వద్దే ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తుంటారు. ప్రభుత్వ ధాన్యం సేకరణ కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తున్న కారణంగా అత్యధికంగా ఆ కేంద్రాలకు తీసుకువస్తుంటారు. ఇలా వచ్చే ఈ ధాన్యాన్ని ప్రభుత్వం ఇప్పటిదాకా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేస్తూ వస్తోంది. ఇందుకు నిధుల కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేవారు. ఆ రుణానికి ప్రభుత్వమే పూచీకత్తుగా వ్యవహరించేది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎఫ్‌సీఐ యాసంగి బియ్యాన్ని కొనుగోలు చేయబోమని చెప్పడంతో బ్యాంకులు కూడా రుణాలిచ్చేందుకు ముందుకు రాకపోవచ్చని భావిస్తున్నారు. దీంతో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రభుత్వానికి పెద్ద భారంగా మారింది. దాని నుంచి బయట పడేందుకు వరిసాగు విషయంలో సర్కారు కఠినంగా వ్యవహరిస్తోంది. యాసంగిలో వరిసాగు నియంత్రణ బాధ్యతలను ప్రభుత్వం కలెక్టర్లకు అప్పగించడంతో వారు.. వ్యవసాయశాఖ, విత్తన డీలర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వరి విత్తనాల విక్రయాలను గణనీయంగా తగ్గించాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు.

వరి సాగు వల్ల కాలుష్యం ఉత్పత్తి అవుతుందని ఇటీవల కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. నీటి వాడకం కూడా విపరీతంగా ఉంటుంది. నీటి సరఫరా కోసం పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సివస్తుంది. ఎప్పుడూ వరిసాగు చేస్తుండడం వల్ల భూసారం కూడా తగ్గిపోతుంది. పైగా ప్రస్తుతం పండిస్తున్న వరి పంటలో బలవర్థకమైన పోషకాలు కూడా ఉండటం లేదు. బియ్యాన్ని ఎక్కువగా పాలిష్ చేస్తుండడంతో దానిపై ఫైబర్‌ను కోల్పోతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల వచ్చిన ఓ అధ్యయనంలో వరి సాగు తగ్గించాలన్న సూచనలు వచ్చాయి. దానిని కేసీఆర్ సర్కారు తప్పుబట్టింది. కానీ, నేడు కలెక్టర్ల ఆధ్వర్యంలో వరిసాగు చేయకుండా చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం వరి విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరిస్తోంది. ఒకవేళ రైతే తన వద్ద ఉన్న విత్తనాలతో వరిసాగు చేస్తే ఎటువంటి చర్యలు తీసుకుంటుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎఫ్‌సీఐ బియ్యాన్ని కొనుగోలు చేయడం లేదంటూ వరిసాగు వద్దంటున్న సర్కారు ముందు వానాకాలంలో కూడా ధాన్యం నిల్వలు అపారంగా ఉన్నాయని, పంటను

కొనబోమని, వరి వేయవద్దని చెబుతుందా? మిగతా పంటలకు కూడా దీనినే వర్తింపజేస్తే పరిస్థితేంటి? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

**ముందస్తు ప్రణాళిక లేకుండానే..**

యాసంగిలో వరిసాగు చేయవద్దంటున్న ప్రభుత్వం.. అందుకు తగిన ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం లేదు. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేయాలని చెబుతున్నా.. ఆయా పంటల సాగుకు తగిన చర్యలు చేపట్టలేదు. ఏయే భూములు ఎటువంటి పంటల సాగును అనువైనవో శాస్త్రీయంగా తేల్చిందిలేదు. పైగా ఇతర పంటలు సాగు చేస్తే..వాటి ఉత్పత్తుల కొనుగోలు విషయంలో రైతులకు భరోసాను ఇవ్వడంలేదు. వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా వరి మాత్రమే పండించదగిన భూముల్లో ఆ పంట సాగును ప్రోత్సహించే వీలున్నా అటువంటి చర్యలేవీ చేపట్టడంలేదు. కేవలం ఎఫ్‌సీఐ బియ్యాన్ని కొనుగోలు చేయడంలేదన్న ఒకే ఒక్క కారణంతో వరిసాగును నియంత్రించాలని చూస్తుండడం రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది.

**వరి విత్తనాలు అమ్మకండి**

**వ**రి సాగు మానేయమని రైతులకు చెబుతున్న వ్యవసాయ శాఖ మరో తీవ్ర నిర్ణయం తీసుకుంది. అన్నదాతలకు వరి విత్తనాలు అమ్మవద్దని ప్రైవేటు విత్తన కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. విత్తన కంపెనీల ప్రతినిధులతో వ్యవసాయ కమిషనర్ రఘునందన్‌రావు సమావేశం నిర్వహించి ఈ మేరకు ఆదేశాలిచ్చారు. ఈ విషయాన్ని ఆయన కార్యాలయం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. యాసంగిలో వరి సాగువల్ల నష్టం వచ్చే అవకాశాలు ఉన్నందున వాటిని అమ్మకుండా ఇతర పంటల విత్తనాలను మాత్రమే అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. వేరుసెనగ, శనగ, పెసర, ఆముదం, పొద్దుతిరుగుడు, నువ్వులు, ధనియాలు తదితర విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సంచాలకుడు డాక్టర్ కేశవులు, ఉద్యాన సంచాలకుడు వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వరికి బదులు మినుములు వేయండి**

యాసంగిలో వరికి బదులు మినుములు వేయాలని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి రైతులకు సూచించారు. మినుముల ధర క్వింటాల్ రూ. 6, 300గా ఉందని, మార్క్‌ఫెడ్ ద్వారా పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని చెప్పారు. మినుములతో పాటు డిమాండ్ ఉన్న పెసర్లు, వేరుశనగ, ఆవాలు, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలు కూడా సాగు చేయాలని మంత్రి తెలిపారు.

**టీఎస్ సీడ్స్ మాటేమిటి..**

ప్రతి సీజన్‌లో రైతులకు అమ్మడం కోసం టీఎస్ సీడ్స్ పలు రకాల విత్తనాలను భారీగా సేకరించి సిద్ధం చేస్తుంది. ప్రస్తుతం వరి విత్తనాలే 2 లక్షల క్వింటాళ్లకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. రైతులు పండించిన విత్తన పంట కొని శుద్ధిచేసి, నిల్వ ఉంచేందుకు రూ.కోట్లు ఖర్చు చేసింది. వ్యవసాయ కమిషనర్ ప్రైవేటు కంపెనీలకు చెప్పినట్లుగా వరి విత్తనాల అమ్మకాలు మానేస్తే టీఎస్ సీడ్స్ ఇప్పటికే సిద్ధం చేసినవాటిని ఏం చేస్తారనేది ప్రశ్న.

**వరి విత్తనాలు అమ్మితే.. దుకాణం మూతే**

యాసంగిలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ చెప్పే క్రమంలో సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామారెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. వ్యవసాయశాఖ అధికారులు విత్తన దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాసంగిలో రైతులకు ఇతర విత్తనాలను విక్రయించాలని, ఎవరైనా వరి విత్తనాలు విక్రయిస్తే ఆ దుకాణాన్ని మూసి వేస్తామని అన్నారు. తాను కలెక్టర్‌గా ఉన్నంతకాలం ఆ దుకాణం తెరుచుకోదని హెచ్చరించారు. హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చినా తెరుచుకోదన్నారు.

కలెక్టర్ వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రతిపక్షాలు మండిపడ్డాయి. అయితే తన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించి ప్రచారం చేశారని కలెక్టర్ తెలిపారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పానన్నారు. ■

**ఇతరుల నిబంధనలను నీవు హేళన చేస్తావు సరే , కానీ నీ నిబంధనలూ అలాంటివేనేమో చూడు**


# సంఘటితమైతేనే సత్ఫలితాలు

## రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు నాబార్డు చేయూత

– అమిర్నేని హరికృష్ణ

**సా**గు సమస్యల పట్ల సంఘటితం కాలేని అశక్తత వల్ల పంటల సాగుతో అన్నదాతలు తీవ్రనష్టాలను చవి చూస్తున్నారు. ఒక్కరుగా సాధించలేనిది సమష్టిగా పొందే అవకాశం ఉన్నా మితిమీరుతున్న రాజకీయ జోక్యం కారణంగా రైతులు ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. దేశంలో ఒకప్పుడు వెల్లివిరిసిన సహకార స్ఫూర్తి నేడు జావ కారిపోవడానికి కారణమిదే.

సహకారోద్యమానికే తలమానికంగా నిలిచిన కొన్ని సంఘాలు సైతం నేడు రాజకీయ రొచ్చులో పడిపోయాయి. ఫలితంగా విత్తన సేకరణ నుంచి పంట విక్రయాల వరకు రైతులు ప్రతి దశలో ఒంటరి పోరాటం చేయాల్సి వస్తోంది. దీనికి భిన్నంగా మహారాష్ట్రలో సత్ఫలితాలు అందించిన రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పిఓ) ను స్ఫూర్తిగా తీసుకుని పలు రాష్ట్రాల్లో ఎఫ్.పి.ఓ.లను ఏర్పాటు చేస్తున్నారు.



**నాబార్డు చేయూత**

ఆధునిక సాగు పరిశోధనలు, సాంకేతికతను అందుబాటులోకి తెచ్చి రైతుకు స్థిరమైన ఆదాయం అందించే లక్ష్యంతో జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు 'నాబార్డు' ఎఫ్.పి.ఓ.ల ఏర్పాటును విస్తృతంగా ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే 600కు పైగా ఎఫ్.పి.ఓ.లు ఏర్పాటయ్యాయి. తన పరిధిలో గతంలో ఏర్పాటైన వాటర్‌షెడ్ సంఘాలు, రైతు క్లబ్బులు, మాతోట సంఘాలలో చాలా వాటిని ఎఫ్.పి.ఓ.లుగా మార్చి సరికొత్త ప్రయోజనాలను అందించేందుకు నాబార్డు తోడ్పడుతోంది. ఈ తరుణంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటు ఆవశ్యకత, సమష్టిగా రైతులకు అందే ప్రయోజనాలు తెలుసుకోవడం ద్వారా ఈ స్ఫూర్తితో మరెందరో రైతులు వీటి స్థాపనకు ముందుకొచ్చే అవకాశముంది. ఇప్పటివరకు రైతులు ఒంటరిగా ఎవరి కష్టం వారు పడుతున్నారు.

విత్తనాల ఎంపిక, పెట్టుబడులు దొరక్కపోవడం, సాగు పద్ధతుల్లో ఆధునికతను అనుసరించలేకపోవడం, సాగునీటి లభ్యత, విపత్తులను ఎదుర్కోలేకపోవడం, బీమాపై అవగాహన లోపించడం, అధిక దిగుబడులు అందక అల్పాదాయంతో నష్టాలు పొందడం రివాజుగా మారింది. కేంద్ర ప్రభుత్వం కూడా వీటి ఏర్పాటును ప్రోత్సహిస్తూ ఎఫ్.పి.ఓ.లకు నిధులను అందిస్తోంది. ఇప్పటికే పలు ఎఫ్.పి.ఓ.లు ప్రగతి బాటలో నడుస్తూ సమష్టి సాగు ప్రయోజనాలను పొందుతున్నాయి.

**ప్రయోజనాలు**

రైతులు ఇలా ఎఫ్.పి.ఓలుగా ఏర్పడితే తమ అవసరాలకు తగ్గ నాణ్యమైన ఉత్పాదకాలను అందరూ కలిసికట్టుగా సకాలంలో తెప్పించుకోగలుగుతారు. వ్యక్తిగతంగా పొందలేని పంట రుణం కూడా ఒక సంఘంలో ఉన్నప్పుడు రైతులు అందుకోగలుగుతారు. సమగ్ర సస్యరక్షణ విధానాలను ఉమ్మడిగా ఆచరించడం ద్వారా శాస్త్రీయ సలహాలను పొందడం, మేలైన సాగు యాజమాన్యాన్ని ఆచరించడం సాధ్యమవుతుంది. పంట కాలంలో అవసరమైన యంత్ర పరికరాలను సమకూర్చుకోవడం ద్వారా

**నీవు ఏ దృష్టితో చూస్తే అదే రకంగా ప్రపంచం నీకు కనిపిస్తుంది, దృష్టి కోణం మార్చి చూడు అంతా అద్భుతమే!**

సకాలంలో సాగు పనులు పూర్తి చేసుకోవచ్చు. ఖర్చు తగ్గడంతో పాటు కూలీల కొరత సమస్యను అధిగమించ వచ్చు. పంటను కలిసికట్టుగా విక్రయించుకోగలుగుతారు. పైగా ధరలేనప్పుడు ఉత్పత్తిని నిల్వ చేసి మంచి ధరలు వచ్చినప్పుడు అమ్ముకోవడం లేదా విలువ జోడించి అధిక ధరలు పొందడం వీరికి సాధ్యపడుతుంది. మొత్తంగా సాగు ఖర్చులు గణనీయంగా తగ్గి అధిక దిగుబడులతో నికర ఆదాయం పెంపొందుతుంది. ఒక్కరుగా కంటే సంఘటితంగా ఇలా రైతులు ఎన్నో ప్రయోజనాలను పొందగలుగుతారు. రైతులందరూ ఒక సంస్థగా ఏర్పడితే సభ్యులే యజమానులు, రైతులూ వినియోగదారులు కావడంతో వారిలో సహకార భావన పెంపొందుతుంది. స్వయం సహాయం, బాధ్యత అలవడుతుంది.

**సభ్యులే యజమానులు**

ఎఫ్.పి.ఓ.ను ప్రారంభించాలాని భావించే రైతులు ముందుగా సహకార స్ఫూర్తికి కట్టుబడి ఉండాలి. రాజకీయాలకు దూరంగా ఉండాలి. రైతు ఉత్పత్తిదారుల సంస్థలను రిజిస్టరు చేయడం ద్వారా చట్టపరంగా వీటికి హక్కులు, బాధ్యతలు సంక్రమిస్తాయి. వ్యవసాయ ఉత్పాదకాలు, పంట విక్రయాలు, విత్తనోత్పత్తి, ఎగుమతి, దిగుమతులు వగైరాలకు సంబంధించి ఇతర సంస్థలతో ఒప్పందాలు చేసుకోవచ్చు.

వీటిని సహకార సంఘాల చట్టం కింద లేదా కంపెనీల చట్టం కింద కూడా రిజిస్టరు చేసుకోవచ్చు. ఇది స్వయం ప్రతిపత్తిని కలిగి ఉంటుంది. చట్టపరంగా వీటికి ఒక నియమావళి ఏర్పడుతుంది. సభ్యులు అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయి. ఇక్కడ సభ్యులే యజమానులు. వారే స్వయంగా మూలధనాన్ని సమకూర్చు కుని స్వయం పాలనతో సభ్యులే వినియోగదారులుగా సేవలు పొందుతారు. ఇందులో సభ్యులందరికీ సభ్యత్వం ఉంటుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో సంస్థను నడిపించేందుకు వారే పాలకవర్గాన్ని ఏర్పరచుకుంటారు. ఈ పాలకవర్గం సభ్యులకు జవాబు దారీగా ఉంటుంది. సభ్యులకు విత్తనాలు సమకూర్చడం, విస్తరణ సిబ్బంది, శాస్త్రవేత్తల సహాయం తీసుకుని ఆధునిక పద్ధతులపై సభ్యులకు అవగాహన కల్పిస్తుంది. రైతుల అవసరాలకు తగ్గట్టు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నేరుగా కంపెనీల నుంచి తెప్పిస్తుంది. బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుని సభ్యులందరికీ రుణాలు ఇప్పించి వాటిని సక్రమంగా చెల్లించే బాధ్యతను తీసు కుంటుంది. సాగునీటి సంఘాలు, నీటిపారుదల శాఖతో మాట్లాడి చేలకు నీరందించేలా సేవలందిస్తుంది. వ్యాపారులు, కొనుగోలు సంస్థలు, ఎగుమతి సంస్థలతో మాట్లాడి దళారుల ప్రమేయం లేకుండా మంచి ధర అందేలా నేరుగా వారికే పంటను విక్రయిస్తుంది. అవసరమైతే దూరప్రాంతాల వారికీ విక్రయించడం ద్వారా రెట్టింపు ధరలు అందేలా చూస్తుంది. అవసరాన్ని బట్టి ఎఫ్.పి.ఓ. స్వయంగా వ్యాపారం చేస్తుంది.

పంటకు విలువ జోడించి వాటిని సూపర్ మార్కెట్లకు తరలించడం లేదా ఎగుమతి చేయడం ద్వారా అధిక ఆదాయం పొందేందుకు దోహదపడుతుంది. ఇలా మార్కెట్ నైపుణ్యాలను ఉపయోగించి నేరుగా వినియోగదారులకూ విక్రయించేలా చర్యలు తీసుకుంటుంది. సభ్యుల కుటుంబాల్లో విద్య, వైద్యం తదితర సేవలను కూడా అందిచేందుకు సభ్యులకు చేయూతనందిస్తుంది. అంతకుమించి సామాజిక సేవలను కూడా అందిస్తే గ్రామాభివృద్ధికి ఎఫ్.పి.ఓ.లు తోడ్పడతాయి. ఈవిధంగా వ్యవసాయం అనుబంధ రంగాల్లో ఎఫ్.పి.ఓ.లు సహకార సంస్థల్లా రాజకీయాలకు అతీతంగా తమకు తాము సంఘటితంగా సేవలు అందిస్తాయి, పొందుతాయి.

**పారదర్శకంగా...**

ఇందుకోసం ఏటా పాలకవర్గం సర్వసభ్య సమావేశాలను నిర్వహించాలి. కమిటీల ఏర్పాటు, సభ్యుల పనితీరు, సిబ్బంది నియామకం, మూలధనం, నిధుల సేకరణ, వాటి వినియోగం, బ్యాంకు ఖాతాల నిర్వహణ, లెక్కల గణన, ఆడిటింగ్ తదితర అంశాలలో సభ్యులందరికీ అన్ని విషయాలు తెలిసేలా పాలకవర్గం పారదర్శకంగా జవాబుదారీగా వ్యవహరించాలి. సభ్యుల నుంచి ఆలోచనలను, నిర్మాణాత్మక సూచనలను ఆహ్వానిస్తూ ఆమోదయోగ్యమైన వాటిని అమలు చేసి సభ్యులందరికీ గరిష్ట

**నీవు గెలిస్తే నీ శ్రేయోభిలాషులకు నీవెవరో తెలుస్తుంది, ఓడితే నీ శ్రేయోభిలాషులెవరో నీకు తెలుస్తుంది**

ప్రయోజనాలు దక్కేలా చూడాలి. అందుకు అవసరాన్ని బట్టి సమావేశాలను నిర్వహిస్తుండాలి. ఏటా సీజన్లకు ముందు రైతుల కోసం విధిగా సమావేశాలు పెట్టి వారికి ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు చూపాలి.

ఇందుకు నియమించే సిబ్బంది లేదా ముఖ్య అధికారి సంస్థకు సేవలు అందించే బాధ్యతను విస్మరించకుండా నిధులు దుర్వినియోగం చేయకుండా పాలకవర్గం పర్యవేక్షించాలి. ప్రధానంగా ఎఫ్.పి.ఓ. ఏర్పాటుకు సంబంధించిన మౌలిక అంశాలకు విఘాతం కలగకుండా సభ్యులైన రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు పాలకవర్గం అన్ని చర్యలూ చేపట్టాలి.

**కలిసి నడిస్తేనే....**

వ్యక్తిగా రైతుకు సేద్యంలో నేడెన్నో సవాళ్ళు ఎదురవుతున్నాయి. సంఘటితంగా వాటిని అధిగమించేం దుకు రైతులు ఏకమై సంఘాలుగా ఏర్పడడం ఎంతో ముఖ్యం. సహకార సంఘాలు విఫలమైన తరుణంలో ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటుతో రైతులు రాజకీయాలకు అతీతంగా అద్భుత విజయాలను అందుకునే అవకాశముంది. ఉదాహరణకు భూమిలేని రైతులకు బ్యాంకులు రుణాలివ్వడం లేదు. వీరంతా వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలు చెల్లించలేక నష్టపోతున్నారు. అలానే మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనే విషయంలో మోసపోతున్నారు. బీమా చేయించడం తెలియక విపత్తుల వల్ల సర్వం కోల్పోతున్నారు. పంటను మంచి ధరకు విక్రయించుకోలేక దళారులకు అయినకాడికి అమ్ముకుంటూ అరకొర ఆదాయంతో నెట్టుకొస్తున్నారు.

అదే వీరంతా రైతు ఉత్పత్తిదారుల సంస్థగా ఏర్పడితే ఖరీఫ్, రబీ సీజన్లకు ముందుగానే సభ్యులైన రైతులందరి అవసరాలకు తెలుసుకుని తమకు కావలసిన నాణ్యమైన విత్తనం, ఎరువులు, పురుగుమందులు ఎంత మొత్తం అవసరమో లెక్కించి కంపెనీలకు ఆర్డరు చేసి అదనులో వాటిని తెప్పించుకుంటారు. ఆమేరకు ఎఫ్.పి.ఓ. పాలకవర్గం వారితో ఒప్పందం కుదుర్చుకుంటుంది. ఎఫ్.పి.ఓ. పరిధిలోని రైతులకు వెయ్యి క్వింటాళ్ళ విత్తనాలు అవసరం అనుకుంటే అవసరమైన విత్తనాలను ఏ ప్రాంతంలో ఉన్నా సంస్థ తెప్పించి సకాలంలో విత్తుకునేలా చర్యలు తీసుకుంటుంది. అందుకవసరమైన ఆధునిక యంత్రాలను కూడా అందుబాటులో ఉంచుతుంది. తద్వారా రైతులు పోసపోయే అవకాశం ఉండదు. అదను దాటిపోతోందనే బెంగ ఉండబోదు. ఇలా ప్రతి విషయంలో ఒక్కరుగా రైతులు పడే ఇబ్బందులను సంఘటితంగా అధిగమించడం రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటుతోనే సాధ్యమవుతుంది.

రాజకీయ పార్టీల మాయలో పడకుండా లాభసాటి సేద్యంతో స్థిరమైన, రెట్టింపు ఆదాయం పొందాలంటే అన్నదాతలు మేల్కోవాలి. గ్రామం మొత్తం కాకపోయినా రైతులు బృందాలుగా అయినా వీటిని ఏర్పాటు చేసుకుని ప్రయోజనాలు పొందే వీలుంది. ఇలా ఉత్సాహం చూపించే రైతులు తెలుగు రాష్ట్రాల్లోని జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) లేదా వ్యవసాయ, సహకార, అటవీశాఖ అధికారులను సంప్రదించి ఎఫ్.పి.ఓ.ల ఏర్పాటు గురించిన సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చు.

**(అన్నదాత పత్రిక సౌజన్యంతో ...)** ■

# 'రైతు బిడ్డ' ఎఫ్.పి.ఓ ప్రథమ మహాసభ

**జా**మిడి గ్రామం లో రైతు బిడ్డ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రథమ మహాసభ నిర్వహించడం జరిగింది. కొత్త పాలక వర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. కోశాధికారిగా బాలాజీ గారిని, సెక్రటరీగా దీపక్ గారిని , ఛైర్పర్సన్ గా గజానంద్ గారిని ఎన్నుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఏపిమాస్ నుండి నవీన్ కుమార్ గారు (ప్రాజెక్ట్ కోఆర్డినేటర్), శ్రీనివాస్ గారు (ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ), అనిల్ గారు ( ప్రాజెక్ట్ ఆఫీసర్ ), శ్రావ్య గారు ఈ మీటింగ్లో పాల్గొనడం జరిగింది. యాపగూడ, ధర్మపురి, గెరిజం, జల్ద, జామిడి గ్రామాల నుండి రైతులు పాల్గొనడం జరిగింది. ■

**కష్టపడి పనిచేయడం ముఖ్యమే, కాని అంతకంటె ముఖ్యమైనది ఆత్మవిశ్వాసం**

# కనుమరుగవుతున్న మహిళల తివాచీ కళా వైభవం!

*ఒకప్పుడు ఏలూరు ప్రాంతానికి అపారమైన కీర్తి తెచ్చిన ఘనత తివాచీలది. భారత్-పర్షియా కళా నైపుణ్యాల మేలుకలయికగా, వందలాది మహిళా కళాకారుల నైపుణ్యంతో అలరారిన ఈ పరిశ్రమ ఇప్పుడు క్రమంగా కనుమరుగవుతున్నది. అయినా ఇప్పటికీ మహిళలే ఈ కళకు ఆలంబనగా నిలుస్తున్నారు.*

**ప**శ్చిమగోదావరి జిల్లా ఏలూరు పేరు వినగానే రంగు రంగుల తివాచీలు కళ్ళ ముందు మెదులుతాయి. దేశీయంగానే కాకుండా... అంతర్జాతీయంగానూ ఇవి ఎంతో ప్రఖ్యాతి పొందాయి. వీటి తయారీలో ప్రధాన పాత్ర మహిళలదే కావడం విశేషం. నాలుగు దశాబ్దాల క్రితం పర్షియా నుంచి తివాచీలు నేయడంలో నైపుణ్యం ఉన్న కళాకారులు మచిలీపట్నానికి వలస వచ్చారు. వారు క్రమంగా ఏలూరు సమీపంలోని తంగెళ్ళమూడి వచ్చి స్థిరపడ్డారు. ఆ రోజుల్లో అక్కడ తంగేడు వనం ఉండేది. దాని నుంచి రంగులను



సహజసిద్ధంగా తీసి వాటిని ఉన్నికి అద్ది తివాచీలు చేసేవారు. వారి నుంచి స్థానికంగా ఉండే ముస్లిం కుటుంబాలవారు ఈ కళను నేర్చుకున్నారు. ఇంటి దగ్గరే ఉండి చేసుకొనే వృత్తి కావడంతో... తివాచీల తయారీలో మహిళలు పెద్ద సంఖ్యలో భాగం అయ్యారు. తమ ఆదాయాలతో కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. ఎప్పటికప్పుడు తమ నైపుణ్యానికి పదును పెట్టుకుంటూ, కొత్త కొత్త డిజైన్లతో తివాచీలను రూపొందించేవారు. వాటికి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మంచి గిరాకీ ఉండేది.

**మహిళలకు వెసులుబాటుగా...**

తివాచీల తయారీ ఇంటి పట్టున ఉండి చేసుకునే పని కావడంతో కుటుంబ సభ్యులందరూ వీటి రూప కల్పనలో భాగస్వాములవుతారు. తివాచీ తయారు చేయాలంటే మగ్గం కచ్చితంగా అవసరం. మగ్గానికి ఇద్దరు మనుషులు విధిగా ఉండాలి. గతంలో భార్యాభర్తలుకలిసి ఈ పని చేసుకునేవారు. ఇంటి పని చేసుకుంటూ మహిళలు దీనిలో భాగమయ్యేవారు. మగవారు బయటికి వెళ్లినప్పుడు ఇంట్లో ఉండే మహిళలే ఈ పని చేసేవారు. ఆ విధంగా తివాచీల తయారీ దాదాపుగా మహిళల చేతికి వచ్చింది. ఇక ఇంట్లో ఉండే పిల్లలు కూడా చిన్నప్పటి నుంచి దీన్ని చూస్తూ ఉండడంతో ... ప్రత్యేకంగా నేర్చుకోకుండానే ఒక అవగాహన వచ్చేస్తుంది.

సాధారణంగా ఈ పని నేర్చుకోవాలంటే కనీసం ఆరు నెలలు సమయం పడుతుంది. కానీ మగ్గం ఉన్న ఇంటి పిల్లలకు, మహిళలకు ప్రత్యేక శిక్షణ అవసరం ఉండదు. దీంతో తివాచీల పరిశ్రమ వారికి మంచి అవకాశంగా నిలుస్తోంది. ఇంటి పనులు పూర్తి చేసుకున్నాక... ఈ పనిలో దిగవచ్చు. స్వతంత్రంగా చేసుకునే అవకాశం ఉండడం కూడా ఈ వృత్తి పట్ల మహిళలు ఎక్కువగా ఆకర్షితులవడానికి కారణమయ్యాయి. అప్పట్లో ఏలూరు నగరంలోనే దాదాపు 500 తివాచీ మగ్గాలు ఉండేవి. వీటి మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల కుటుంబాలు ఆధారపడేవి. కానీ అదంతా గతం. వందల్లో ఉండే మగ్గాలు పదుల సంఖ్యలోకి... వేలల్లో ఉండే కళాకారులు వందల సంఖ్యలోకి తగ్గిపోయారు. ఈ పరిస్థితికి కారణాలు అనేకం అని చెబుతున్నారు ఈ వృత్తిపై ఇప్పటికీ ఆధారపడి జీవిస్తున్న మహిళలు.

**కనీస ఆదాయం, ప్రోత్సాహం కరువై...**

ఏలూరు తివాచీలకు స్థానికంగా దొరికే ఉన్నిని ఉపయోగించరు. న్యూజిలాండ్ నుంచి లేదా మన దేశంలోని రాజస్థాన్ నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న ఉన్ని మాత్రమే వినియోగిస్తారు. ఇటీవలి కాలంలో ఆ ఉన్ని ధర,

రవాణా ఖర్చులతో పాటు తివాచీలకు వాడే రంగుల ధర కూడా బాగా పెరిగిపోయింది. దీంతో ఉత్పాదక వ్యయం అనేక రెట్లు ఎక్కువయింది. ప్రస్తుతం ఒక మీటరు తివాచీ తయారీకి అయిదు నుంచి ఆరువేల రూపాయలు ఖర్చవుతోందని ఉత్పత్తిదారులు చెబుతున్నారు. వచ్చేదానిలో మూడొంతులు ముడిసరుక్కే సరిపోతుంది. మిగిలిన ఒక వంతు మాత్రమే ఈ కళాకారులకు దక్కుతుంది.

ఒక తివాచీ తయారీకి సైజును బట్టి వారం నుంచి పది రోజులు పడుతుంది. తయారు చేసినవారికి దక్కేది మూడు నుంచి నాలుగు వేల రూపాయల కూలీ. ఒక తివాచీ తయారీకి కనీసం ఇద్దరు, ఒక్కోసారి ముగ్గురు మహిళలు అవసరమవుతారు. ఆ వచ్చిన మొత్తాన్నే వీరందరూ పంచుకోవాలి. అంటే రోజుకు దొరికేది రూ. 200 కన్నా తక్కువే. అందుకే ఈ తరం వారు తివాచీల తయారీ పట్ల ఆసక్తి చూపించడం లేదు. మరోవైపు కరోనా కూడా ఈ పరిశ్రమను తీవ్రంగా దెబ్బ తీసింది. ఎగుమతులు లేకపోవడంతో ఆర్డర్లు ఆగిపోయి, కళాకారులు ఇళ్ళకే పరిమితం కావలసి వచ్చింది. కనీస ఆదాయం లేకపోవడంతో ఆసుపత్రుల్లో ఆయాలుగా, దుకాణాల్లో సేల్స్ గర్ల్స్‌గా చాలామంది చేరిపోయారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఈ సంప్రదాయ కళా రూపానికి ప్రభుత్వం తరఫు నుంచి తగిన ప్రోత్సాహం లేదనీ, కొత్తవారికి శిక్షణ ఇవ్వడానికి చేపట్టిన కార్యక్రమాలు కూడా 1990ల తరువాత ఆగిపోయాయనీ ఈ కళాకారులు చెబుతున్నారు. ముడి సరుకుల భారాన్ని మోయలేకపోతున్న ఈ పరిశ్రమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీలూ లేవని అంటున్నారు.

"ఉత్తరప్రదేశ్‌లోని బదోహి, మిర్జాపూర్, ఆగ్రా, పానిపట్, రాజస్థాన్‌లోని జైపూర్‌లు కేంద్రాలుగా సాగుతున్న తివాచీ పరిశ్రమ ఏటా ఏడు నుంచి ఎనిమిది కోట్ల టర్నోవర్ సాధిస్తోంది. తివాచీలకు ఉన్న డిమాండ్‌కు ఇది నిదర్శనం. మాకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తే... భారత్–పర్షియా కళా నైపుణ్యాల మేలికలయిక అయిన ఏలూరు తివాచీలకు పూర్వవైభవాన్ని సాధించి పెడతాం. ఆ ప్రాంతాల కన్నా మెరుగైన స్థితికి ఈ పరిశ్రమను తీసుకువెళ్తాం" అంటున్నారు స్థానిక తివాచీ తయారీదార్లు.

**రోజుకు 350 రూపాయలన్నా రావాలి**

గతంలో రెండు వందలు కూలీ వచ్చినా కొంచెం ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడేమో ధరలు బాగా పెరిగిపోయాయి. ఆ ధరలకు అను గుణంగా కూలీ ఉండాలి. ఇప్పుడు ఒక తివాచీ నేస్తే 3 వేల రూపాయలు వస్తాయి. ఇది ఇద్దరం పంచుకోవాలి. ఒక తివాచీ నేయాలంటే కనీసం



వారం నుంచి పది రోజులు పడుతుంది. అంటే పది రోజులకు ఒక మనిషికి రూ. 1,500 వస్తుందన్న మాట! గతంలో అడపాదడపా పని చేసినా రోజుకు రూ. 200 ఆదాయం ఉండేది. ఇప్పుడు రోజంతా పని చేసినా ఆ ఆదాయం రావడం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కనీసం రూ. 350 అయినా కూలీ వస్తేనే గిట్టుబాటవుతుంది. కానీ వస్తున్న కొద్ది మొత్తమైనా కుటుంబానికి ఏదొకవిధంగా ఉపయోగపడుతుందని ఈ పనిలోనే కొనసాగుతున్నా.

*–వాసా గాయత్రి, ఏలూరు*

**చాలా మంది ఈ పని మానేశారు!**

ఈ రోజుల్లో ఇంట్లో ఒకరు పని చేస్తే చాలని పరిస్థితి. అందువల్ల మేం కూడా ఈ పని చేస్తున్నాం. ఇంటి పట్టున ఉండి పని చేసుకుంటుంటాం. మా ఇంట్లో చిన్నప్పటి నుంచి



ఈ పని చేసేవారు. వేం మా అమ్మవాళ్లను చూసి ఈ పని నేర్చుకున్నాం. ప్రత్యేకించి ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. మేం ఇంటి పనులన్నీ చేసుకుని, పిల్లల్ని స్కూలుకు పంపి కాస్త తీరిక చేసుకుని మగ్గాల్లోకి వెళతాం. సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ పని చేస్తుంటాం. గతంలో రోజుకు రూ. 300 దాకా వచ్చేవి. ఇప్పుడంతగా రావడం లేదు. దీంతో చాలామంది ఈ పని మానేశారు. గతంలో ఏ మూల చూసినా ఈ మగ్గాలే ఉండేవి. ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు.

*–షేక్ ఫాతిమా, తంగెళ్లమూడి*

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...)

**నీ బలహీనతలు గ్రహిస్తే బలవంతుడివి, లోపాలు గ్రహిస్తే సమర్థుడివి, గుణపాఠం నేర్చుకుంటే వివేకివి**

# కథా 'మాధురి' అందిస్తున్న సహజ సౌందర్య సాధనాలు !

**తుంగభద్రా నదీ తీరంలో ఆమె కథా'మాధురి'. కృష్ణాతీరంలో పారిశ్రామికవేత్త. నడిచి వచ్చిన దారుల్లో తారసపడిన ఎన్నో జీవితాలను కథలుగా మలిచారు. ఇప్పుడు మూలికలు, తైలాలతో... పూర్వకాలం సౌందర్య సాధనాలను తయారుచేసి ఈ తరానికి అందిస్తున్నారు. కర్ణాటకలోని గంగావతి నుంచి కృష్ణా తీరానికి చేరుకున్న మన్నెం సింధుమాధురి పారిశ్రామికవేత్తగా మారడం వెనుక కథేమిటో ఆమె మాటల్లోనే...**

**తా**ను నడిచి వచ్చిన దారుల్లో తారసపడిన ఎన్నో జీవితాలను కథలుగా మలిచారు సింధుమాధురి. ప్రకృతి మనకు ఇచ్చిన మూలికలు, తైలాలతో తన అమ్మమ్మలు తయారు చేసిన సౌందర్యసాధనాలన్నింటినీ తిరిగి ఈ తరానికి అందిస్తున్నారు. కర్ణాటకలోని గంగావతి నుంచి కథలతో కాలక్షేపం చేస్తూ, కృష్ణా తీరానికి చేరుకున్న ఆమె ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారడం వెనుక ఒక కథే ఉంది. ఆ కథ ఏంటో ఆమె మాటల్లోనే విందాం..



''మాది కర్నాటకలోని గంగావతిలో ఉళైనూర్ క్యాంప్. అమ్మమ్మవాళ్ల ఊరు గుంటూరు జిల్లా బొబ్బర్లంక. నేను ఇక్కడే పుట్టాను. మా మూలాలు ఇక్కడివే. మా ముత్తాతల కాలంలో ఇక్కడి నుంచి కర్నాటక వెళ్లి స్థిరపడ్డారు. కమ్యూనిస్టు నేపథ్యం ఉన్న కుటుంబం మాది. అమ్మ యలవర్తి జోయా, నాన్న సుబ్బారావు ఇద్దరూ వైద్యులే.

**రచయిత్రి నుంచి పారిశ్రామికవేత్తగా ...**

'మా స్నేహితురాలి వాళ్ల పాప తీవ్రమైన ఎలర్జీతో బాధపడుతుండేది. ఆహారంలో బోలెడు మార్పులు చేశారు. అయినా ఫలితం లేదు. ఎలర్జీ టెస్ట్ చేయిస్తే స్నానానికి వాడే సబ్బులు, డిటర్జెంట్స్ కారణమని తెలిసింది. నాకు అప్పుడు నా బాల్యంలో మా అమ్మమ్మవాళ్ల ఇంట్లోనే తయారు చేసిన సబ్బులు, సున్నిపిండి గుర్తుకొచ్చాయి. అప్పట్లో వంట నూనెలను ఏడాది మొత్తానికీ ఇంట్లోనే గానుగలో తయారు చేసుకునేవారు. ఏడాది చివరికి మిగిలిన నూనెతో దుస్తులు ఉతుక్కునే సబ్బులను, వెన్నతో స్నానం సబ్బులను, రకరకాల మూలికలతో సున్నిపిండిని, తేనె తుట్టె నుంచి వచ్చే మైనం నుంచి క్రీమ్‌లను తయారుచేసేవారు. అది గుర్తుకొచ్చి పాపను కొద్దిరోజులు నాకు అప్పజెప్పమని అడిగాను. వాళ్ళు సరేనన్నారు. వెంటనే గుంటూరు మార్కెట్‌లో ఆయుర్వేద దినుసులు సేకరించి, స్నానంపొడి (సున్నిపిండి కాదు) చేసి ఇచ్చాను. పాపకు రోజూ దానితోనే స్నానం. దుస్తులను సబ్బు వినియోగించకుండా, వేడి నీటిలో జాడించమని సూచించాను. పది రోజుల్లో ఎలర్జీ తగ్గిపోయింది. ఆతర్వాత పాపకు ఆ పొడితోనే సబ్బు, తేనె మైనంతో క్రీము తయారు చేసి ఇచ్చాను.

నేను హుబ్లీలో బ్యూటిక్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లమో ఇన్ కాస్మొటాలజీ చేశాను. అప్పట్లో హంపీలో ఫ్రెంచ్ సినిమా షూటింగ్స్ జరిగేవి. వారికి మేకప్ పర్సన్‌ను నేనే. మేకప్ తీసేసిన తరువాత ఎలర్జీతో ఇబ్బందిపడేవారి కోసం తేనె మైనంతో క్రీమ్ చేసి ఇచ్చేదాన్ని. ఆ క్రీమ్‌నే ఇప్పుడూ తయారు చేస్తున్నాను.

**ఎన్నో పరిశోధనల తరువాత ...**

ఈ సంఘటన జరిగి ఆరేళ్లవుతుంది. అప్పటికి నేచురల్ ప్రొడక్ట్స్ ఎక్కడాలేవు. వీటిపై దృష్టి సారించాను. రెండేళ్లు పరిశోధనలో మునిగి తేలాను. ఎంతలా అంటే నా ఇంటి నిండా సబ్బులే. ఎలా తెలిసిందో ఒకరోజు గుంటూరు జిల్లా పరిశ్రమల అధికారిణి వాణి మా ఇంటికి వచ్చారు. 'ఇంత శ్రమిస్తున్నపుడు ఉద్యోగ్ ఆధార్ లేకుంటే ఎలా?' అంటూ వెంటబెట్టుకెళ్లి ఇప్పించారు. ఇక నేను ఒక సబ్బుతో ఆగదలుచుకోలేదు. ఒక్కో శరీరతత్వానికి ఒక్కో రకం సబ్బు

కావాలి. ప్రకృతిలో సహజంగా లభ్యమయ్యే పూల రెమ్మలు, చెట్ల కొమ్మలు, బెరళ్లు, మూలికలతో వాటిని తయారు చేయాలనుకున్నాను. ఆర్గానిక్ ఆయిల్స్ కావాలి. ఏడాదిన్నర అన్వేషణ తరువాత కర్నాటక – తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోని ఉడుముల పేట, తమిళనాడులోని సేలం, కేరళలోని మున్నార్‌లలో నమ్మకమైన ఆర్గానిక్ పంటలను సాగు చేసే రైతులతో పరిచయం అయింది.

**సబ్బుల తయారీ ఇలా..**

సబ్బుల తయారీకి వాగాయి చెక్క గానుగతో తీసిన నూనెను వినియోగిస్తాను. రంగు, పరిమళం కోసం ఎసెన్షియల్ ఆయిల్స్ కావాలి. ఇందుకు కొన్ని క్వింటాళ్ల పూల రెమ్మలు, కాండాలు, పండ్ల తొక్కలు కావాలి. వాటిని మట్టి కుండల్లో కాస్తారు. హిమాచల్‌ప్రదేశ్ పర్వత ప్రాంతాల్లో వీటిని తయారు చేస్తారు. ఇవి చాలా ఖరీదుతో కూడుకున్నవి. ఒక్క జాస్మిన్ ఎసెన్షియల్ ఆయిల్ ఖరీదు లీటరు రూ.మూడు లక్షలు ఉంటుంది. వర్షం నీటిని సేకరించి, ఒక ట్యాంక్‌లో ఉంచి, డిస్టిలేషన్ చేయిస్తాం. ఆ నీటిని, పరిమితంగా సోడియం సాల్ట్‌ను వాడతాం. అలోవీరా, దానిమ్మ రసం, గులాబీ పూరేకులరసం వంటి వాటితో కోల్డ్‌ప్రాసెస్డ్‌ఆయిల్స్‌ను తయారుచేసి,తేనెమైనంకలిపి ప్రత్యేకమైన సబ్బులను తయారు చేస్తాం. కెమికల్స్ కలపం కాబట్టి మా సబ్బును తయారైన 18 నెలల్లోపు వాడాలి. ప్యాక్‌పై 12 నెలలే అని రాస్తాం.

డ్రగ్ లైసెన్స్ కోసం ఎన్ని తిప్పలో..మా ఉత్పత్తులను అమెజాన్‌లో ఉంచాలన్నది నా కల. అందుకు ప్రభుత్వం ఇచ్చిన డ్రగ్‌లైసెన్స్ ఉండాలని నిబంధనపెట్టారు. అధికారుల చుట్టూ తిరిగాను. పని కాలేదు. ఇదే సమయంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని 400 మంది ఎంటర్ ప్రెన్యూర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో నా సబ్బుల తయారీ గురించి, నాకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించి, 'నాకు లోన్లు, సబ్సిడీలతో పని లేదు.. డ్రగ్ లైసెన్స్ ఇప్పిస్తే తల తాకట్టు పెట్టుకునైనా వ్యాపారం చేసుకుంటాను.' అని చెప్పాను. ఆయన ఒక అధికారికి ఆ బాధ్యతలను అప్పజెప్పారు. కొద్దిరోజుల్లో డ్రగ్ లైసెన్స్ వచ్చింది. నా కల నెరవేరింది. ఇప్పుడు ఈ ప్రాంతం నుంచి అమెజాన్‌లో అత్యధిక అమ్మకాలు 'కలాపి'వే.

**సక్సెస్‌కు దగ్గర దారి లేదు**

సక్సెస్‌కు దగ్గర దారి లేదు. శ్రమే విజయానికి చేరువ చేస్తుంది. ఏ కష్టమూ పడకపోతే దాని విలువ ఎవరికీ తెలియదు. ఎందుకంత కష్టపడతావంటారు అందరూ. నాకందులోనే ఆనందం ఉంది. ఆరోగ్య పరంగా, ఆర్థికంగా ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొన్నాను. అయినా నిలదొక్కుకున్నాను.

**విలువలతో కూడిన వ్యాపారం చేయాలి**

వ్యాపారం అందరూ చేయాలి. లాభాలను ఆర్జించాలి. కానీ ఆ వ్యాపారం విలువలతో కూడినదై ఉండాలి. మనమూ, మనతో పాటు మన సమాజమూ ఆరోగ్యంగా ఉండాలి కదా. అటువంటి వ్యాపారం జరగాలన్నదే నా కోరిక. ఈ నేచురల్ ప్రొడక్ట్స్ తయారీ కోసం చాలా కృషి చేయాల్సి వచ్చింది. నేను నేర్చుకున్న విద్య నాతోనే ఆగిపోకూడదు. అందుకే ఆసక్తి ఉన్నవారందరికీ శిక్షణ ఇద్దామనుకుంటున్నా. త్వరలోనే నా మనసులోని ఆలోచనకు ఆచరణ రూపం ఇస్తా. పెద్ద పెద్ద బ్రాండ్‌నేమ్స్‌తో మార్కెట్లో హల్‌చల్ చేస్తున్న కెమికల్ ప్రొడక్ట్స్ స్థానంలో నేచురల్ ప్రొడక్ట్స్ విస్తృతంగా రావాలి. అదే నా లక్ష్యం.

**ఒక్కొక్కరికీ ఒక్కో కాంబినేషన్ సబ్బు**

సాధారణంగా ఒక కుటుంబం మొత్తం ఒకే రకం సబ్బును ఉపయోగిస్తారు. కానీ మేము సబ్బులను శరీరతత్వాన్ని, సమస్యలను దృష్టిలో ఉంచుకుని తయారు చేస్తాం. ఉదాహరణకు కొందరి శరీరంపై మచ్చలుంటాయి. అవి ఎక్కువగా ఉంటే 100 శాతం నీమ్‌తో తయారు చేసిన సబ్బును ఉపయోగించాలి. ఒక మోస్తరు మచ్చలుంటే.. వయసు పైబడిన వారికైతే వీట్‌గ్రాస్, తక్కువ వయసువారికి నీమ్ అండ్ అలోవెరా. అన్ని రకాల చర్మ సంబంధ ఎలర్జీలకు కోకోనట్, ఆల్‌మండ్ కాంబినేషన్ చక్కగా పని చేస్తుంది. యువతకు గులాబీ, దానిమ్మ రసంతో తయారు చేసిన సబ్బును సూచిస్తాం. ఇవి కాకుండా 24 రకాల గింజలు, పువ్వులు, ఆకులు, దినుసులను, మట్టితో శుద్ధి చేసిన ఆయిల్‌ను వినియోగించి హెయిర్ ఆయిల్ తయారు చేస్తాం.

**(మిగతా 21వ పేజీలో)**

**నీవు మోసే బరువు కంటె ఆ బరువును నీవు మోసే తీరే నిన్ను ఎక్కువగా కుంగదీస్తుంది**

# భర్త ఆరోగ్యం కోసం మారథాన్ పరుగు!

అనారోగ్యంతో బాధపడుతున్న భర్త ప్రాణాలు కాపాడుకోవాలనే లక్ష్యం ఆమెది. ఆ లక్ష్యం కోసం తాను ఆరు పదులు దాటిన వృద్ధురాలినన్న విషయాన్ని మరిచి పోయిందామె. తన ఐదోతనాన్ని నిలుపుకోవడం కోసం వయసును లెక్కచేయకుండా 'మారథాన్'లో పాల్గొన్నది. అందర్నీ ఆశ్చర్యపరుస్తూ విజేతగా నిలిచింది. ఒక్కసారి కాదు... వరుసగా మూడేళ్ల పాటు 'బారామతి మారథాన్'లో విజేతగా నిలిచి ఎందరికో స్ఫూర్తినిచ్చింది 72 ఏళ్ల లతా కరే. మహారాష్ట్రలోని మారుమూల గ్రామానికి చెందిన ఈ వృద్ధురాలి కథనంతో స్ఫూర్తి పొందిన ఇద్దరు యువకులు ఆమె కథకు దృశ్యరూపమిచ్చారు. ఆ విశేషాలే ఇవి...




కరీంనగర్‌కు చెందిన నవీన్‌కుమార్, యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం నెమురగొముల గ్రామానికి చెందిన ఎర్రబోతు కృష్ణ మారథాన్ విజేత లతాకరే జీవిత కథ ఆధారంగా ఆమె పేరుతోనే మరాఠీలో చిత్రం 'లతా భగవాన్ కరే'ను రూపొందించారు. ఈ చిత్రం ఇటీవల (జనవరి 17న) మహారాష్ట్రలో విడుదలయ్యింది.

**ఎవరీ మారథాన్ విజేత...**

మహారాష్ట్రలోని బుల్దాన జిల్లా పింప్లీ గ్రామానికి చెందిన లతా భగవాన్ కరే దంపతులకు నలుగురు కూతుళ్లు. ఏళ్ల తరబడి కూలీనాలీ చేసి కూడబెట్టిన డబ్బుతో కూతుళ్ల పెళ్ళిళ్లు జరిపించారు. అందుకోసం చేసిన అప్పులు ఆమె కుటుంబానికి భారంగా మారాయి. అప్పులు తీర్చేందుకు భార్యాభర్తలు కష్టపడుతున్న సమయంలో అనుకోని ఆపద వచ్చి పడింది. భర్త భగవాన్ కరే ఒంట్లో నలతగా ఉందని చెప్పడంతో లతా కరే ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లింది. ఏదో ఇన్‌ఫెక్షన్ సోకి ఉంటుందని పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్తే గాని అసలు విషయం ఏమిటో తెలుస్తుందని చెప్పడంతో ఆమె ఆందోళనకు గురైంది.

రెండు రోజుల్లోనే భర్త నడవలేని స్థితికి చేరుకున్నారు. పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక తనలో తాను మధనపడింది. భర్తను ఎలాగైన కాపాడుకోవాలనే ఆరాటంతో బంధువులు, చుట్టుపక్కలవాళ్ల దగ్గరకెళ్లి సాయం అందించాలని వేడుకుంది. ఎంతో కొంత అందిన సాయంతో భర్తను పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లింది. ఎంఆర్ఐ లాంటి పరీక్షలు చేయాలంటే రూ. 5వేల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో ఆమె గుండె ఆగినంత పనైంది. హృదయవిదారకంగా రోదిస్తూ ఆ రోజంతా బారామతి ఆసుపత్రి వరండాలోనే ఉండిపోయిందామె.

**పేపరు ప్రకటనే ఊపిరి పోసింది...**

భర్త ఆకలిగా ఉందని చెప్పడంతో లతా కరే ఆస్పత్రి బయట రోడ్డు చివరన ఉన్న ఓ కొట్టు వద్దకు వెళ్లి తన దగ్గర ఉన్న కొద్దిపాటి చిల్లరతో రెండు సమోసాలు తీసుకువచ్చి తినమని భర్తకు ఇచ్చింది. సమోసాలు చుట్టిన పేపరులో మరాఠీలో పెద్ద పెద్ద అక్షరాలతో కూడిన ప్రకటన లతా కరే కంట పడింది. 'బారామతి మారథాన్‌లో పాల్గొనండి.. రూ.3 వేలు నగదు గెలుచుకోండి' అనేది ఆ ప్రకటన సారాంశం. రాత్రంతా తెగ ఆలోచించి... మారథాన్‌లో పాల్గొని రూ.3 వేలు గెలుచుకోవాలనుకుంది. ఆ డబ్బుతో భర్తకు వైద్యం చేయించాలని గట్టిగా నిర్ణయించుకుంది. మరుసటి రోజు (2013 డిసెంబర్ 17న) బారామతి మారథాన్ ప్రారంభం కావడానికి సిద్ధమైంది. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన అనేక మంది మహిళలు స్పోర్ట్స్ దుస్తులు, షూ ధరించి పరుగుకు సిద్ధమయ్యారు. అప్పుడే లతా కరే 9 గజాల నేత చీరతో, పాదాలకు కనీసం చెప్పులు



కూడా లేకుండా మారథాన్ జరిగే ప్రదేశానికి చేరుకుంది.

పోటీల్లో పాల్గొనేందుకు తనకు కూడా అవకాశం ఇవ్వాలని నిర్వాహకులను కోరింది. అందుకు వాళ్లు నిరాకరించారు. అయితే పరిస్థితిని వివరించి వేడుకోవడంతో నిర్వహకులు ఎట్టకేలకు అనుమతిచ్చి చివరి వరుసలో నిలబెట్టారు. 'తాను ఎక్కడ నిలుచున్నాను అనేది కాదు... ఎలాగైన రూ. 3వేలు గెలుచుకుని తన భర్తకు వైద్యం చేయించాల'నే టార్గెట్ ఒక్కటే ఆమె కళ్ల ముందు కనిపించింది.

పరుగు పందెం మొదలైంది... లక్ష్యం ముందు తన కాళ్లకు గుచ్చుకుంటున్న రాళ్లు రప్పలు కనిపించడం లేదు.. అదే లక్ష్యం.. అదే వేగం.. అదే పరుగు .. బారామతి ప్రజల చప్పట్లు ఆమెను మరింత ఉత్సాహపరిచాయి. అందర్నీ ఆశ్చర్యపరుస్తూ లతా కరే మారథాన్ విజేతగా నిలిచింది. భర్తపై లతా కరేకు ఉన్న ప్రేమకు అక్కడివారంతా జేజేలు పలికారు. అప్పటికప్పుడు మారథాన్ నగదు ప్రైజు రూ. 3వేల నుంచి రూ. 5వేలకు పెంచారు. ఆమె లక్ష్యం ముందు సమస్యలన్నీ చిన్నబోయాయి.

గెలుచుకున్న డబ్బుతో భర్తను కాపాడుకుంది. అంతే... మహారాష్ట్రలోని పత్రికలు, ఛానళ్లు ఆమె గొప్పతనాన్ని కీర్తించాయి. నెల తిరగకుండానే ఎంతోమంది సహాయం అందించగా ఆమె బ్యాంకు ఖాతాలో రూ. 2 లక్షల వరకు జమ అయ్యాయి. అప్పటినుంచి వరుసగా మూడేళ్ల పాటు మారథాన్ విజేతగా లతా కరేనే గెలవడం గమనార్హం. ఇదే కథను 'లతా కరే' పేరుతో మరాఠీలో సినిమాగా తీశారు ఇద్దరు తెలుగు యువకులు. ఇటీవలే మహారాష్ట్రలో విడుదలైన ఈ సినిమాను త్వరలోనే తెలుగులోకి అనువదించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**పత్రికల్లో చదివి...**

**మా**ది కరీంనగర్. సినిమా దర్శకుడిగా ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో లతా కరే కథనం చదివాను. చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఆమె జీవిత కథాంశంతో సినిమా తీయాలనుకున్నా. అనేక వ్యయ ప్రయాసలకోర్చి మహారాష్ట్రకు వెళ్లి లతాకరే కుటుంబాన్ని కలిశా. స్క్రిప్టు సిద్ధం చేసుకుని, ఆమెతోనే బయోగ్రఫీ తీశా.

***– నవీన్‌కుమార్ దర్శకుడు***

**తెలుగు ప్రేక్షకుల ముందుకు...**

**ల**తా కరే జీవితం ఎందరికో ఆదర్శం. అలాంటి గొప్పవ్యక్తి యదార్థగాథను సమాజానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో చిత్ర నిర్మాణం చేపట్టా. మహారాష్ట్రలో ఈ సినిమా విడుదలై అందరి ప్రశంసలు అందుకుంటోంది. త్వరలోనే ఈ చిత్రాన్ని తెలుగులోకి అనువదించి మన ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తా.

***– ఎర్రబోతు కృష్ణ, నిర్మాత.***

■

## కథా 'మాధురి' సహజ సౌందర్య సాధనాలు

(19 వ పేజీ తరువాయి)

ఆర్గానిక్ పెసలను ఆవునేతితో వేయించి, 32 రకాల దినుసులను, మాను పసుపును ఉపయోగించి సున్నిపిండి తయారు చేస్తాం. కొబ్బరిపాలు, కొబ్బరి నూనె, నీళ్లు, క్రీమ్, ఎసెన్షియల్ ఆయిల్స్‌తో షాంపూబార్ తయారు చేస్తాం. ఇవి అందరికీ ఉపయోగపడతాయి. వ్యాపారం అందరూ చేయాలి. లాభాలను ఆర్జించాలి. కానీ ఆ వ్యాపారం విలువలతో కూడినదై ఉండాలి. మనమూ, మనతో పాటు మన సమాజమూ ఆరోగ్యంగా ఉండాలి కదా. అటువంటి వ్యాపారం జరగాలన్నదే నా కోరిక.

■

**అద్భుతాలు, అందాలు కళ్ళు చూడగలిగేవో, స్పర్శకు తెలిసేవో కావు;మనసుతో అనుభవించవలసినవే!**

# ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ మహిళల ముందంజ !

వ్యవసాయం, ఆహారశుద్ధి వినియోగం, పంపిణీకి సంబంధిత పనులతో పాటు కుటుంబానికి, సమాజానికి ఆహారాన్ని సమకూర్చడంలో గ్రామీణ మహిళల పాత్ర అమోఘమైనది. పంటలు , తోటల సాగు పశుపోషణ, పసుపు తదితర అనుబంధ పనుల్లో మహిళా రైతులు, కార్మికులు, బాలికల శ్రమ అంతా ఇంతా కాదు. యావత్ సమాజానికి ఆహార భద్రత కల్పించడంలో వీరిది కీలక పాత్ర.

పురుషుల కన్నా అధిక గంటలు జారీ చేసిన వీరి శ్రమకు తగిన గుర్తింపు దొరకటం లేదన్నది వాస్తవం. అనుదినం గుర్తు చేసుకోవాల్సిన విశేష సేవలు అందిస్తున్న గ్రామీణ మహిళలు, బాలికలకు చేదోడుగా నిలవడం కోసం అక్టోబర్ 15 వ తేదీని “అంతర్జాతీయ గ్రామీణ మహిళా రైతుల, శ్రామికుల దినోత్సవం” జరుపుకుంటున్నాం. ఈ ఏడాది కూడా అక్టోబర్ 15 వ తేదీన గ్రామీణ మహిళా రైతుల, శ్రామికుల దినోత్సవాన్ని జరుపుకున్నాం.

పొలాల్లో, పెరట్లో రసాయనాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగు చేయటంలో ఏపీలో గ్రామీణ మహిళా రైతులు, భూమి లేని మహిళా కార్మికులు ముందంజలో ఉన్నారని అధ్యయనాలు తెలియచేస్తున్నాయి.





పితృస్వామిక వ్యవస్థలో గ్రామీణ మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న అన్యాయాలను రూపుమాపే లక్ష్యంతో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించే పనికి స్వచ్ఛంద కార్యకర్తలు 1995లో శ్రీకారం చుట్టారు. 2007లో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ దీనికి ఆమోద ముద్ర వేసింది.

పర్యావరణ సంక్షోభానికి కరోనా మహమ్మారి తోడై ప్రాణాలు తోడేస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అర్ధాకలితో జీవించేవారి సంఖ్య గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 20% పెరిగింది. 2021లో ‘మన కోసం ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని పండిస్తున్న గ్రామీణ మహిళల కృషికి గుర్తింపునివ్వాలని ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం పిలుపునిచ్చింది.

ప్రపంచ జనాభాలో మహిళలు, పిల్లల సంఖ్య 75%. తాము నివసిస్తున్న సమాజంలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ వాతావరణాన్ని

→

నిన్ను ప్రేమించే వారిని ప్రేమించు, బాధించిన వారిని క్షమించు, నీ అవసరం వున్న వారికి సహాయపడు

# తక్కువ వడ్డీకే రుణం సమకూరే మార్గాలివే...

**మీ** ఆర్థిక అవసరాలను తీర్చుకోలేకపోతున్నారా..? డబ్బుల్లేక సతమతంఅవుతున్నారా..? అయిన వాళ్ల దగ్గరా అప్పు పుట్టడం లేదా..? బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ నుంచి వ్యక్తిగత రుణం తీసుకోవచ్చు. కానీ, పర్సనల్ లోన్‌పై 11 శాతం 18 నుంచి స్థాయిలో వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు, ఇతర చార్జీలు అదనం. కొన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు ఫిన్‌టెక్ కంపెనీలతో కలిసి డిజిటల్ రుణాలు కూడా ఆఫర్ చేస్తున్నాయి.

తక్షణమే సొమ్ము చేతికొచ్చే అవకాశమున్నప్పటికీ.. అధిక ప్రాసెసింగ్ చార్జీలు, తిరిగి చెల్లింపులు కాస్త జాప్యమైనా భారీ పెనాల్టీలు భరించేందుకు సిద్ధంగా ఉండాలి. ఈ తలనొప్పులు వద్దనుకునే వారికి, తక్కువ వడ్డీకే సత్వరం రుణం పొందేందుకు కొన్ని ప్రత్యామ్నాయాలున్నాయి. ఆ వివరాలు..

**ఎఫ్‌డీపై రుణం**




మీకుగానీ, మీ కుటుంబ సభ్యులకు గానీ ఏదేని బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఉంటే గనుక దానిపై రుణం తీసుకోవచ్చు. వెంటనే మంజూరవుతుంది కూడా. సాధారణంగా, ఎఫ్‌డీ సొమ్ములో 85-90 శాతం వరకు రుణం లేదా ఓడీ రూపంలో పొందవచ్చు.

**జీతంపై ఓడీ**

ఒకవేళ మీరు వేతన జీవులైతే, మీ జీతంపై ఓవర్‌డ్రాఫ్ట్ (ఓడీ) పొందవచ్చు. మీ జీతంపై మూడు రెట్ల వరకు ఓడీ, ఏడాది కాలం పాటు లభించే అవకాశం ఉంటుంది. ఈ వసతిలో మీరు వాడుకున్న ఓడీ సొమ్ముకు, వాడుకున్న కాలానికి మాత్రమే వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. ఇది నాన్-ఈఎంఐ ఆఫర్. ప్రతినెలా వడ్డీ కడితే సరిపోతుంది. ఓడీ వసతిని మధ్యలో ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చు. అదీ ఎలాంటి పెనాల్టీ లేదా చార్జీలు లేకుండానే. శాలరీ అకౌంట్‌పై ఓడీ కావాలనుకునేవారు మీ బ్యాంక్ బ్రాంచ్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

**మ్యూచువల్ ఫండ్ లోన్**

కొన్నిబ్యాంక్‌లు డెట్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోని పెట్టుబడుల తనఖాపైనా రుణాలు ఆఫర్ చేస్తున్నాయి. ఇది




ఓడీ తరహా రుణం. అంటే, మంజూరైన రుణంలో వాడుకున్న సొమ్ముకు వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. మీరు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేయని పక్షంలో బంగారు ఆభరణాలు, బీమా పాలసీ లేదా ప్రాపర్టీ తాకట్టు పైనా రుణం తీసుకోవచ్చు. ■

**ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ మహిళల ముందంజ !**

రూపుదిద్దటంలో తమ ఆలోచనలు, దృష్టికోణం, నైపుణ్యాలు, అనుభవాలకు మరింత న్యాయమైన పాత్ర దక్కాలని వారు ఆశిస్తున్నారు. ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని అందించ డానికి అహరహం శ్రమిస్తున్న గ్రామీణ మహిళా రైతులకు వందనాలు. మన ఆకలి తీర్చి జవసత్వాలనిచ్చే ప్రతి ముద్దకూ మహిళా రైతులకు అందరం కృతజ్ఞులమై ఉండాలి. ■

# పాతరగడ్డితో దాణా కొరతకు చెక్

పశువులకు పచ్చిమేత అవసరానికి మించి ఎక్కువగా లభించే రోజుల్లో ఎక్కువ ఉన్న పచ్చిమేతను గుంతల్లో చెడిపోకుండా భద్రపరిచి పశువులకు భవిష్యత్తులో వాడుకునే విధానాన్నే పాతర గడ్డి లేదా సైలేజ్ అంటారు. పాతర గడ్డి తయారుచేసుకునే విధాన, పశుగ్రాస రకాలు, సలహాలు, సూచనలను వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్ ఇలా అందిస్తున్నారు.

**పాతరగడ్డికి అనువైన పశుగ్రాస రకాలు**

జొన్న, మొక్కజొన్న, చెరుకు ఆకులు, ఎన్.బి.21, పేరా గడ్డి. ఒక పశువుకి రోజుకు 20 కిలోల పాతర గడ్డి ఇవ్వొచ్చు. దీనిప్రకారం పశువులకు దాణా కొరత ఏర్పడే 120 రోజులకు సరిపడే పాతర గడ్డిని తయారుచేసుకుంటే వేసవిలో పచ్చిమేత కొరతను అధిగమించవచ్చు. ఒక ఎకరం జొన్న, మొక్కజొన్న పైరుతో 5 పశువులకు 120 రోజులకు సరిపడా సైలేజ్ తయారుచేసుకోవచ్చు. రోజుకు ఒక పశువుకి 20 కేజీల వంతున ఐదు పశువులకు 120 రోజులకు 12వేల కిలోల సైలేజ్ అవసరమవుతుంది. వీటికి అవసరమైన సైలేజ్ తయారుచేయడానికి 18వేల కిలోల పచ్చిమేత అవసరం.

**15 టన్నుల సైలేజ్ తయారుచేసేందుకవసరమైన పరిమాణం**

ఒక ఘనపుటడుగు సైలేజ్ బరువు 15 కేజీలు ఉంటుంది. 15 టన్నుల పాతర గడ్డి తయారుచేయడానికి 1000 ఘనపుటడుగుల పాతర కావాలి. దీనికి ఐదు అడుగుల లోతు, 8 అడుగుల వెడల్పు, 20 అడుగుల పొడవు గల పాతర తయారు చేసుకోవాలి. సైలేజ్‌ను పాతర తెరిచిన 30 రోజుల్లో వాడుకోవాలి. అందువల్ల ఈ వెయ్యి ఘనపుటడుగుల పాతరను 4 నుంచి 8 భాగాలుగా తయారు చేసుకుంటే పాతర గడ్డి చెడిపోకుండా ఉంటుంది.

**పాతర తయారీ, జాగ్రత్తలు**

పాతర అడుగుభాగంలో నీరు చేరకుండా చూడాలి. సైలేజ్ తయారీ సమయంలో పాతర వేసే గడ్డికి నీరు, గాలి తగలకుండా ఉండాలి. పాతర అడుగు భాగంలో సిమెంట్ లేదా గచ్చు చేసినప్పటికీ చిన్ని చిన్ని రంధ్రాలు ఉంటే సైలేజ్ తయారీలో తయారయ్యే ద్రవాలు కిందిగి దిగి సైలేజ్ చెడిపోకుండా ఉంటుంది. పచ్చిమేతను కోసిన వెంటనే పాతర వేయకుండా దానిలోని నీటి శాతం 60 శాతం లోపు ఉండేలా పొలంలో ఆరబెట్టి తేమను తగ్గించాలి. లేత, మరీ ముదురు పశుగ్రాసం పాతరకు పనికిరాదు. పశుగ్రాసం పాతర వేసే సమయంలో కొంత తవుడు, జొన్నపిండి, మొలాసిస్ 2 శాతం కలిపి దానికి కొంత ఉప్పు కూడా వేస్తే సైలేజ్ పులియకుండా ఉంటుంది. పశుగ్రాసాన్ని రెండు, మూడు వరుసల్లో నింపుతూ ప్రతి వరుసను బాగా తొక్కి గాలి లేకుండా చూడాలి. పశుగ్రాసం నింపడం పూర్తయిన తరువాత భూమిపై గోడుగా వచ్చేలా చూసి దానిపై వృథాగా ఉన్న పనికిరాని గడ్డి లేదా ఆకులు కప్పి, దానిపై నాలుగు అంగుళాల మందాన మట్టి మేఘాలు లేదా పాలిథిన్ షీట్‌తో కూడా కప్పవచ్చు. ఇలా కప్పి ఉంచిన పాతర గడ్డి రెండు నెలలకు మాగి కమ్మటి వాసనతో పశువులకు రుచికరమైన దాణా తయారవుతుంది. పచ్చిమేత దొరకని సమయంలో కూడా పచ్చిమేతకు సమానమైన సైలేజ్‌ను పశువులకు దాణాగా వాడవచ్చు. ఎండుదాణా,ఎండుగడ్డి నిల్వ ఉంచడంలో ఏర్పడే అగ్నిప్రమాద అవకాశాలను తొలగించవచ్చు.

వేసవిలో పశుగ్రాస సాగుకు అయ్యే ఖర్చుకంటే సైలేజ్ తయారీకయ్యే ఖర్చు బాగా తక్కువ. అవసరం లేకుండా పాతరను తెరవకుండా సైలేజ్‌ను రెండు, మూడేళ్ళ వరకు కూడా నిల్వ ఉంచుకోవచ్చు. చిన్న యంత్ర పరికరం ద్వారా తయారైన సైలేజ్‌ను కేక్‌లా తయారుచేసి నిల్వ ఉంచుకోవచ్చు.


**సబ్సిడీపై యంత్ర పరికరాలు**

సైలేజ్ తయారీలో భాగంగా పశుగ్రాసాన్ని చిన్ని చిన్ని ముక్కలుగా కత్తిరించే యంత్రాలను పశుసంవర్ధకశాఖ సబ్సిడీపై అందచేస్తోంది. ఈ యంత్రాలపై 50 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తుంది. అలాగే సైలేజ్ తయారీకి అవసరమైన గుంతల (పాతరగడ్డి తొట్టె)ను ఏర్పాటు చేసుకునేందుకు ఉపాధి హామీ పథకంలో ఖర్చు లేకుండా ఏర్పాటు చేసుకోవచ్చు. ■

# ఇత్తడి ఉత్పత్తులతో ఊరంతా ఉపాధి !

**టం**గ్.. టంగ్.. టక్కుంటక్కుం.. అంటూ లయబద్ధంగా వినిపించే శబ్దాలు.. ఏ ఇంటి ముంగిట చూసిన ఇత్తడి సామగ్రి, కళాకృతుల మెరుపులు.. అజ్జరం ప్రత్యేకం.. సాధారణంగా ఏ ఊరిలోనైనా వర్ణాలను అనుసరించి వృత్తులు చేయడం పరిపాటి. అయితే ఈ గ్రామంలో మాత్రం అన్ని వర్ణాల వారూ కలిసి ఇత్తడి సామాన్ల తయారీని వందల ఏళ్లుగా చేస్తూ ఉపాధి పొందుతున్నారు. దీంతో అజ్జరం ఇత్తడి పరిశ్రమకు పెట్టింది పేరుగా మారింది. గంటల తయారీలో ప్రత్యేకతతో ప్రతి ఆలయంలోనూ 'అజ్జరం గంట' మోగాల్సిందే అన్నట్టుగా నిలిచిపోయింది.





పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలం అజ్జరంలో దాదాపు 200 ఏళ్ల నుంచి ఇత్తడి సామగ్రి పరిశ్రమ ఉంది. నాడు చేతి పనిముట్లతో వస్తువులు తయారు చేయగా ప్రస్తుతం యంత్రాలతో పనులు చేస్తున్నారు. ఇక్కడ తయారైన గంటలు దేశంలోని ప్రముఖ ఆలయాల్లో మార్మోగుతున్నాయి. గ్రామ జనాభా 2,957 మంది కాగా 2,500 మంది ఇత్తడి సామాన్ల తయారీపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి ఇత్తడి పని తప్ప మరే పని తెలియదంటే అతిశయోక్తి కాదు. తరతరాలుగా సామగ్రి, కళాకృతుల తయారీలో వీరు నైపుణ్యం కనబరుస్తుండటంతో గ్రామంలో ఇత్తడి పరిశ్రమ దినదినాభివృద్ధి చెందింది.



**గంటలు ప్రత్యేకం**

ఇత్తడితో పలురకాల సామగ్రిని తయారుచేస్తున్నా ఆలయాల్లో గంటల తయారీతో వీరి ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. 50 గ్రాముల నుంచి 500 కిలోల వరకూ గంటలను వీరు తయారు చేసి రికార్డు సృష్టించారు. ఇత్తడి గంటల తయారీలో ప్రత్యేక ముద్ర వేస్తున్నారు. ఇత్తడి అంటే అజ్జరం.. అజ్జరం అంటే ఇత్తడి.. అన్నట్టుగా పేరు సంపాదించారు. పట్టణాల్లో దుకాణదారులు 'అజ్జరం వారి ఇత్తడి షాపు' అని పేరు పెట్టుకుని వ్యాపారులు సాగిస్తున్నారు.

**200 ఏళ్ల అనుబంధం**

అజ్జరానికి ఇత్తడితో అనుబంధం 200 ఏళ్లుగా కొనసాగుతోంది. అప్పట్లో ముడిసరుకులను కలకత్తా, మద్రాసు నుంచి తీసుకువచ్చి ఇక్కడ వస్తువులు తయారు చేసేవారు. ప్రస్తుతం ఇక్కడే ఇత్తడి రేకులు తయారుచేసి రాష్ట్ర నలుమూలలకు సరఫరా చేస్తున్నారు. చిన్నా,పెద్దా

తేడా లేకుండా పనులు చేస్తున్నారు. వేకువ జామున పని మొదలుపెట్టి రాత్రి వరకూ పనులు చేస్తూనే ఉంటారు. ఇత్తడి బిందెలు, బకెట్లు, పల్లెం, చెంబు, గంగాళా, డేగిసా, పప్పు గిన్నెలు తదితర పెళ్లి సామగ్రి కోసం రాష్ట్ర నలుమూలల నుంచి అజ్జరం వస్తుంటారు. దీంతో గ్రామ ఖ్యాతి దశదిశలా విస్తరించింది.

**తరతరాలుగా..**

మా తాత పేరలింగం, తండ్రి సాంబమూర్తి ఇదే పని చేసేవారు. నేనూ ఇదే పనిలో ఉన్నాను. 20 ఏళ్ల క్రితం చిన్నా, పెద్దా తేడా లేకుండా ఈ పనికి వచ్చేవారు. తర్వాత కాలంలో చిన్న పిల్లలు పనికి రాకపోవడంతో పని నేర్చుకునే వారు తగ్గారు. 50 గ్రాముల నుంచి 500 కిలోల వరకూ గంటలను ప్రత్యేకంగా తయారు చేస్తున్నాం. ఈ గంటలు దేశంలోని అన్ని ప్రముఖ ఆలయాలకు అందించాం. అమెరికా కూడా పంపించాం. ఈ మధ్య కాలంలో యంత్రాలపైన తయారీ ఎక్కువయ్యింది.

*బొప్పే సత్యలింగం, ఇత్తడి పరిశ్రమ యజమాని*

**చిన్నప్పటి నుంచీ..**

పుట్టినప్పటి నుంచి ఈ పనిలోనే ఉన్నాను. పని పూర్తిగా





ఉండటంతో కుటుంబాన్ని ఏ లోటూ లేకుండా చూసుకుంటున్నా. ఇటీవల మిషన్లు రావటంతో పనికి డిమాండ్ తగ్గింది. దీని వలన కొన్ని ఒడిదుడుకులు వచ్చాయి.

*– పాటి సత్యనారాయణ, వర్కర్*

**తండ్రి ద్వారా..**

నా తండ్రి ద్వారా ఈ పని అబ్బింది. పనిని ఇష్టంగా చేస్తాం. మా వద్దకు వచ్చిన కస్టమర్లు మా పనిచూసి ఎంతో అందంగా ఉందని ప్రశంసించినప్పుడు చాలా ఆనందం కలుగుతుంది. ఈ పనిలోనే హాయి ఉంది.

*– నున్న వీరవెంకట సత్యనారాయణ, వర్కర్*

**ఇదే జీవనోపాధి**

మేము నాయీబ్రాహ్మణులమైనా ఇత్తడి పనినే జీవనోపాధిగా ఎంచుకున్నాం. మిషన్లు రావటంతో పని నేర్చుకునేవారు తక్కువైపోయారు. దీంతో ఈ పని మా తరంతోనే అంతరించిపోతుందేమోనని అనిపిస్తోంది.

*– బొజ్జోరి బాలరాజు, వర్కర్*

**40 ఏళ్లుగా...**

40 ఏళ్లుగా ఈ పని చేస్తున్నా. గ్రామంలో అందరూ ఇదే పని చేస్తుంటాం. ఇతర వ్యాపారాలు ఏమీ తెలియవు. ఇటీవల యంత్రాల రాకతో పని నేర్చుకునేవారు తగ్గారు. భవిష్యత్ ఎలా ఉంటుందో తెలియలేదు.

*– యడ్ల పోతురాజు, వర్కర్*

(సాక్షి సౌజన్యంతో)

## సూక్ష్మసేద్యం పథకానికి రూ.121 కోట్లు

రైతులకు రాయితీపై బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను ఇచ్చే సూక్ష్మ సేద్యం పథకానికి రూ. 121 కోట్లు విడుల చేస్తూ తెలంగాణా ఉద్యానశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకానికి ఈ ఏడాది బడ్జెట్ లో రూ. 242 కోట్లు కేటాయించగా మొదటి 6 నెలలకు అందులో సగం ఇస్తున్నట్లు తెలిపింది. అందుకు అనుగుణంగా వానాకాలం సీజన్‌కు ముందు ఇస్తే రైతులకు రాయితీలివ్వడానికి ఉపయోగపడేవి. కానీ తొలి 6 నెలలు, వానాకాలం పంటల సీజన్ అయిపోయాక నిధుల విడుదలకు పరిపాలనా అనుమతినిస్తూ ఇప్పుడు ఉత్తర్వులిచ్చింది. కనీసం యాసంగిలోనైనా పరికరాలు ఇస్తారా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ■

# ఎరువులపై సబ్సిడీకి కేంద్రం ఆమోదం

రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ఎరువులపై సబ్సిడీ కింద రూ.28,655 కోట్ల కేటాయింపునకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఒన్‌టైమ్ ప్యాకేజీ కింద నత్రజని, ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులపై అదనపు సబ్సిడీగా రూ.837 కోట్లు కేటాయించింది. అలాగే డీఏపీపై అదనపు సబ్సిడీ కింద రూ.5,716 కోట్లు కేటాయించింది. తద్వారా రబీలో ఎరువుల ధరలు పెరగకుండా రైతులకు ప్రయోజనం చేకూరనుంది. అక్టోబరు 2021 నుంచి మార్చి 2022 మధ్యకాలంలో ఈ సబ్సిడీని వర్తింపజేస్తారు. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన అక్టోబరు 12 న జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశం నిర్ణయం తీసుకుంది. కాగా పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ మిషన్ అమృత్ పథకాల రెండో దశ అమలుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

**పట్టణాల్లో స్వచ్ఛ భారత్, అమృత్ రెండో దశ**

స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ.లక్షా 41 వేల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది. ఇందులో కేంద్రం వాటాగా రూ.36,465 కోట్లను కేటాయిస్తున్నట్టు పేర్కొంది. లక్ష జనాభా దాటిన పట్టణాల్లో వ్యర్థాల ప్రాసెసింగ్, నీటి వృధాను అరికట్టడం తదితర పనుల కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. అమృత్ పథకం అమలు కోసం రూ.2.77 లక్షల కోట్లను ఖర్చుచేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో కేంద్రం వాటాగా రూ.76,760 కోట్లను కేటాయిస్తున్నట్టు తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరా, పారిశుద్ధ్యం కోసం ఈ నిధులను ఖర్చు చేస్తారు.

**సైనిక స్కూల్ సొసైటీ పరిధిలోకి 100 పాఠశాలలు**

కాగా దేశవ్యాప్తంగా 100 స్కూళ్లకు సైనిక్ స్కూల్ సొసైటీ అనుబంధ హోదా ఇవ్వాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. వీటిలో ప్రభుత్వ స్కూళ్లతో పాటు ప్రైవేటు బడులు కూడా ఉన్నాయి. దీంతో సొసైటీ పరిధిలో అదనంగా సుమారు 5 వేల సీట్లు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. 2022-23 విద్యా సంవత్సరం నుంచి సైనిక్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయా స్కూళ్లలో అడ్మిషన్లు చేపడతారు. ■

## గర్భనిరోధక మాత్రలతో జాగ్రత్త!

గర్భ నిరోధక మాత్రల వాడకం గురించి తెలిసినంతగా వాటి పనితీరు గురించిన అవగాహన మహిళల్లో ఉండదు. మరీ ముఖ్యంగా ఐ పిల్ లాంటి ఎమర్జెన్సీ కాంట్రాసెప్టివ్స్‌ను విచక్షణ లేకుండా వాడేస్తూ ఉంటారు. ఇది ప్రమాదకరం. ఐపిల్ గర్భనిరోధక పద్ధతులను అవలంబిస్తూ పొరపాటున మర్చిపోయిన సందర్భంలో వాడుకోవలసిన అత్యవసర మాత్ర. నెలలో ఒకటి రెండుసార్లకు మిన హాయింపు ఉంటుంది. అలాకాకుండా ఐ పిల్స్‌నే పూర్తిగా గర్భనిరోధక సాధనంగా వాడటం వల్ల శరీరంలో హార్మోన్ల హెచ్చు తగ్గులు ఏర్పడి నెలసరి క్రమం తప్పటం, అబార్షన్స్, గర్భం దాల్చలేకపోవటం లాంటి సమస్యలకు దారి తీయవచ్చు. ఒకవేళ అప్పటికే గర్భందాల్చి ఉండి, పిల్ వాడితే దాని ప్రభావం పిండం మీద పడి జన్యుపరమైన సమస్యలతో బిడ్డ పుట్టే ప్రమాదం ఉంటుంది. నిజానికి ఐ పిల్ అనేది పూర్తి స్థాయిలో గర్భధారణని అడ్డుకోలేదు.

ఇది విఫలమయ్యే అవకాశాలు కూడా ఉంటాయి. అలాగే ఎమర్జెన్సీ కాంట్రాసెప్టివ్ మాత్రల్ని 25 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్కులే వాడాలి. అంటే అండాశయాలు పూర్తిగా తయారయినవాళ్లు మాత్రమే వాడాలి. అలా కాకుండా 16 ఏళ్ల వయసు నుంచే ఈ మాత్రల వాడకం మొదలుపెడితే భవిష్యత్తులో దీర్ఘకాల సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. కాబట్టి స్త్రీలు ఈ మాత్రల మీద ఆధారపడకుండా వైద్యుల్ని కలిసి ఇతరత్రా గర్భనిరోధక ప్రత్యామ్నాయాలను తెలుసుకుని అవలంబించటం ఆరోగ్యకరం. ■

**మనస్సులో ఏది నాటితే అది పెరుగుతుంది; ప్రేమ,ద్వేషం;పగ,ప్రతీకారం;ఆశ,నిరాశ ... ఏదైనా: నిర్ణయం మనదే**

# మధుమేహాన్ని నియంత్రించే ములక్కాడల కూర !

'దీపనం వాత పిత్తఘ్నం వృష్యం వర్ణ్య ప్రమేహజిత్
చక్షుష్యం శుక్రదం రుచ్యం బృంహణం శ్లేష్మ నుత్తథా'

ములక్కాడ సాధారణ కూరగాయ కాదు. ఆహార పదార్థంగా తీసుకోదగిన అద్భుత ఔషధ ద్రవ్యం. ఆహార ఔషధాల్లో ములక్కాడ ఎన్నదగినది కూడా!

ములక్కాడ మొక్కని 'శిగ్రు' అంటారు. మోరింగ ఒలిఫెరా దీని వృక్షనామం. డ్రమ్ములు వాయించే కర్రల్లా ఉంటాయి కాబట్టి వీటిని 'డ్రమ్ స్టిక్స్' అంటారు. హిమాలయ ప్రాంతాల్లో పుట్టి పెరిగి ప్రపంచం అంతా విస్తరించిన



భారతీయ వృక్షం ఇది. ఋగ్వేదంలో కౌసిక సూత్రం శిగ్రు మొక్కని క్రిమిసంహారకంగా పేర్కొంది. ప్రాచీన రోమన్లు ములక్కాడ గింజల్లోంచి తీసిన నూనెని చర్మవ్యాధుల్లో వాడేవారు. మునగ ఆకుల్ని, కాడల్నీ యుద్ధవీరులకు శక్తిదాయకంగా భావించి వండిపెట్టేవారు. దీన్ని మిరాకిల్ మొక్కగా దేవుడి కానుకగా ఆఫ్రికన్ జాతులవారు భావిస్తారు. షుగరువ్యాధి, బీపీ, కీళ్లవాతం వ్యాధులతోపాటు ఎయిడ్స్‌లాంటి క్షీణింపచేసే వ్యాధుల్లో ఇది ఔషధం కూడా!

ములక్కాడలు కొద్దిగా కారం, వగరు రుచులు కలిగి ఉంటాయి. తేలికగా అరుగుతాయి. తీక్షణంగా పని చేస్తాయి. కానీ కొంచెం వేడి చేస్తాయి. అందుకని అతిగా ములక్కాడలు తింటే బాగా చెమటలు పడతాయి. వాతాన్ని కఫాన్ని అదుపు చేస్తాయి. చింతపండు లేకుండా ములక్కాడల రసం (చారు) కాచుకుని రోజూ ఖాళీ కడుపున తాగితే బీపీ, కొలెస్ట్రాల్ షుగరువ్యాధి లాంటివి నెమ్మదిస్తాయి. స్త్రీ పురుషుల మధ్య ఆసక్తి పెరుగుతుంది. లివరు, స్ప్లీన్, పాంక్రియాజ్, గర్భాశయం లాంటి సున్నిత అవయవాలలో దోషాలపైన ములక్కాడలు, ములగ ఆకులూ ఔషధంగా పనిచేస్తాయి. క్షారగుణం కలిగినవి. కాబట్టి ఎసిడిటీని నివారిస్తాయి. గడ్డల్ని వాపుల్ని కరిగిస్తాయి. తల్లిపాలు పెరిగేలా చేస్తాయి. థైరాయిడ్ సమస్యలున్నవారికి ఆయాసం ఉబ్బసం ఉన్నవారికి మేలు చేస్తాయి.

**ములక్కాడలతో కూర**

లేతగానూ, పొడవుగానూ, మనోహరంగానూ ఉన్న ములక్కాడలను ఎంచుకోవాలి. ముక్కలుగా తరిగి పైన పీచు తీసేసి, నీళ్లతో కడిగి తుడిచి, కొద్దిగా నెయ్యి వేసిన భాండీలో కాసేపు వేయించాలి. ఆవాలు, మిరియాలు, కొబ్బరి, నువ్వులు వీటిని తగుపాళ్లలో తీసుకుని దోరగా వేయించి మెత్తగా నూరాలి. ఈ పొడిలో కొంచెం పాలు పోసి కొద్దిసేపు పొయ్యి మీద ఉంచి వడగట్టండి! ఈ పాలలో ఇందాక వేగించిన ములక్కాడల ముక్కలు వేసి ఉడికించండి!

ఇప్పుడు ఓ భాండీ తీసుకుని కొద్దిగా నెయ్యి వేసి ఇంగువ తాలింపు పెట్టి, అందులో మినప వడియాల్నీ, అప్పడాల ముక్కల్ని దోరగా వేగించండి. ఈ ములక్కాడల ముక్కల్ని పాలతో సహా అందులో కలిపి పాలు ఇగిరేదాకా ఉడికించండి. దింపబోయే ముందు తగినంత ఉప్పు, మిరియాలపొడి కలపండి. రాజుగారికి దీన్ని వడ్డన చేయబోయే ముందు ఈ కూరని ఓ వస్త్రంలో మూటగట్టి బాగా కాగుతున్న నేతిలో

**మనసుంటే మార్గముంటుంది, మనసు లేకుంటే సాకు సిద్ధంగా వుంటుంది**

(11వ పేజీ తరువాయి)

కొద్దిసేపు ఉంచి, వేడి మీద వడ్డిస్తే అమోఘంగా ఉంటుందని వివరించాడు నలుడు.

మనకీ యుగంలో ఈ నేతి మూటలు అవసరం లేకపోయినా పాలతో వండిన ములక్కాడల కూర ప్రత్యేకతని అర్థం చేసుకోవాలి! శనగపిండి, మసాలాలు దట్టించిన ములక్కాడల కూర ఇప్పటిరోజుల్లో మనకు బాగానే అలవాటు. ములక్కాడలు కొద్దిగా వేడిచేస్తాయి కాబట్టి దీనిలో అరివీరభయంకరంగా చింతపండురసం, అల్లం వెల్లుల్లి మసాలాలను కలపకుండా ఈ కూరని తయారు చేశాడు నలుడు. మనం తినబోయే ఆహార పదార్థం పట్ల మనకు భక్తిభావం ఉండాలి. అప్పుడే దాన్ని ఆరోగ్యదాయకంగా వండుకోగలుగుతాం. మసాలాలు అనేవి మాంసంలో నీచు వాసన పోవటానికి మాత్రమే ఉద్దేశించినవి. ఎలాంటి ఇబ్బందికర వాసనలు లేనప్పుడు ఆ కూరలో మసాలాలు వేయనవసరం లేదని నలుడి సూచన. అందుకే ఈ ములక్కాడల కూరలో మసాలాలను చేర్చలేదు. బాగా వగరు చేదు రుచులు ఉన్న పదార్థాలను మరో మార్గంలో ఆ చేదుని తొలగించటం సాధ్యం కానప్పుడే చింతపండు లాంటివి కలపవలసి ఉంటుంది. అనవసరంగా అల్లం వెల్లుల్లి, చింతపండు రసాలను పోసి ఏదీ వండనవసరం లేదని నలుడి పాఠం.

నలుడు చెప్పిన పద్ధతిలో వండిన ములక్కాడల కూర జీర్ణ శక్తిని వృద్ధి చేస్తుందని, వాత దోషాన్ని, పైత్యాన్ని తగ్గిస్తుందని, లైంగిక శక్తిని పెంచుతుందని, శరీరానికి మంచి రంగునీ, కాంతినీ ఇస్తుందనీ, మధుమేహం, మూత్ర పిండాల వ్యాధుల్ని తగ్గించే ఔషధంగా పని చేస్తుందనీ, కంటి చూపు మెరుగుపరుస్తుందనీ, పురుష జీవకణాలను పెంపు చేస్తుందనీ, రుచిని ఇస్తుందని, శరీరంలో మాంస ధాతువుని వృద్ధి





చేస్తుందనీ ఈ కూరకు గల ప్రయోజనాన్ని వివరించాడు నలుడు. అప్పడాలు, వడియాలతో ఈ కూరని వండటం వలన ఈ కూరకు గల లైంగిక శక్తిని పెంచే స్వభావం మరింత పెరుగుతుంది. అలా కాకుండా కేవలం కారపు మసాలాలు పోసి వండితే లైంగికశక్తి హరిస్తుంది.

ములక్కాడల పరమాన్నం' పేరుతో కోనసీమలో ఇంచుమించు ఇలాంటి వంటకాన్నే తయారు చేస్తుంటారు. కొద్దిగా బియ్యాన్ని నానబెట్టి మెత్తగా రుబ్బిన పిండిని, తురిమిన కొబ్బరినీ, అలాగే పైన చెప్పిన పద్ధతిలో ఉడికించిన ములక్కాడల ముక్కల్నీ, తగినంత ఉప్పు, కొద్దిగా నీళ్లు కలిపి, ఉడుకుతూ ఉండగా బెల్లం లేదా పంచదార కలిపి సన్నసెగన వండుతారు. ఒక ముద్దగా దగ్గరకు వచ్చిన తరువాత ఇంగువ తాలింపు పెడతారు. ఒకవిధంగా ఇది తీపి కూర. తీపి కలిపి వండితే స్నాక్స్ లాగా తినటానికి వీలుగా ఉంటుంది. తీపి కలపకుండా వండితే అన్నంలోకి బావుంటుంది.

పాలతో ములక్కాడల కూర అనేది ఆరోగ్యసూత్రం. పాలతో వండితే పాలు విరుగుతాయి కాబట్టి కొబ్బరి పాలతో వండితే మరింత రుచిగా ఉంటుంది. పాకశాస్త్ర ప్రావీణ్యం కొద్దీ ఇలాంటి మార్పులు చేసుకునే అనుమతి ఇచ్చాడు నలుడు. ■

# మురికివాడల బాలికలకు బామ్మ అండ!

ఎందరో మహానుభావులు..అందరికీ వందనాలు.. వాగ్గేయకారుడు త్యాగరాజు ఆలపించిన కీర్తనల్లో ఇదీ ఒకటి. అయితే.. మీనా మెహతా గురించి తెలుసుకున్న వారెవరికైనా ముందుగా మదిలో మెదిలేది ఈ కీర్తనే. రాజస్థాన్ రాష్ట్రం సూరత్ వాస్తవ్యురాలైన మీనా గురించి తెలుగు వారికి పెద్దగా పరిచయం లేకపోయినప్పటికీ.. ప్రధాని నరేంద్ర మోదీ, బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి వంటి ఎందరో ప్రముఖులు ఆమెపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆమె సహాయం పొందిన వారు మీనాను ఆప్యాయంగా 'శానిటరీ ప్యాడ్ల బామ్మ' అని పిలుస్తుంటారు. మీనా మెహతా గతపదేళ్లుగా మురికివాడల్లో నివసించే బాలికలకు శానిటరీ ప్యాడ్లు పంచుతూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు.



పేదరికం ఎన్నో అవస్థలకు కారణం. అయితే... మురికివాడల్లోని బాలికలు, స్త్రీలు మాత్రం రుతుక్రమంగా కారణంగా కొన్ని ప్రత్యేకమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఓ సందర్భంలో స్లమ్ ఏరియాలో నివసించే ఓ బాలిక ఎదుర్కొన్న కష్టాన్ని ప్రత్యక్షంగా చూసిన మీనా తల్లడిల్లిపోయా. పదేళ్ల క్రితం నాటి ఘటన ఇది. ఆ రోజు నేను కారులో వెళుతుండగా.. ఓ దారుణమైన దృశ్యం నా కంట పడింది. టీనేజ్‌లో ఉన్న ఓ బాలిక చెత్తకుండీలో దేని కోసమే వెతకడం నాకంట పడింది. కాస్త తరిచి చూస్తే ఆమె చేతిలో వాడి పారేసిన శ్యానిటరీ ప్యాడ్ కనిపించింది. దీన్ని చూసి నేను ఒక్కసారిగా షాకైపోయా. వీటిని ఎందుకు ఏరుతున్నావు అని ఆమెను అడిగా. ఇలా వాడిపారేసే శానిటరీ ప్యాడ్లను నీళ్లలో కిడిగి మళ్లీ వాడుకుంటానని ఆమె చెప్పింది. దీంతో.. నాకు నోట మాట రాలేదు. పేదరికం కారణంగా ఆమె ఎంతటి క్లిష్టమైన పరిస్థితి ఎదుర్కుంటోందో నాకు అర్థమైంది. నాటి నుంచే నేను మహిళలు, బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్లు పంచడం ప్రారంభించా" అని మీనా ఆ దృశ్యాన్ని గుర్తు తెచ్చుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. గత పదేళ్లుగా ఆమె నిర్విరామంగా..ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ కూడా గతంలో మీనాపై ప్రశంసల వర్షం కురిపించారు.

25 ఏళ్ల వయస్సు నుంచే సామాజిక సేవలో నిమగ్నమైన మీనా...ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తే తనకు స్ఫూర్తి అని చెబుతారు. 2004లో సునామీ సంభవించిన సమయంలో...సుధామూర్తి నాలుగు ట్రక్కుల నిండా శానీటరీ ప్యాడ్లు తీసుకొచ్చి పంచడాన్ని చూశానని ఆమె తెలిపారు. "సునామీ బాధితులకు ఆహారం, వస్త్రాలు ఇవ్వాలని అందరూ ప్రయత్నిస్తుంటారు. కానీ..నెలసరిలో ఉన్న మహిళల పరిస్థితి ఏమిటి..?" అన్న సుధామూర్తి ప్రశ్న తనను కదిలించిందని మీనా పేర్కొన్నారు. తొలుత..శానిటరీ ప్యాడ్ల పంపిణీకే మీనా ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ.. తరువాతి కాలంలో ఆమె ప్యాంటీల పంపిణీ కూడా చేపట్టారు. ప్యాంటీలు లేకుండా కేవలం శ్యానిటరీ ప్యాడ్లు పంపిణీ వ్యర్థమని భావించి..వీటి పంపిణీ కూడా చేపట్టానని ఆమె తెలిపారు. నటుడు అక్షయ్ కుమార్‌ను కలిసిన సందర్భంలో ఆమె ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ప్యాంటీల ప్రాధాన్యం కూడా తెలిసేలా ప్రజల్లో అవగాహన పెంచాలని ఆమె అక్షయ్‌ను కోరారు. ఈ దిశగా మీనా ఓ మ్యాజికల్ కిట్‌ను పంపిణీ చేపట్టారు. ఈ కిట్‌లో 8 శ్యానిటరీ ప్యాడ్లు, 2 అండర్‌వేర్లు, నాలుగు షాంపూ శాషేలూ ఓ సబ్బు ఉంటుంది. మీనా ఈ కిట్లను ప్రతినెలా బాలికలకు పంచుతారు.

ఒక్క వ్యక్తితో ఈ సమస్యకు పరిష్కారం దొరకదని

నీవు కోరుకునే ప్రోత్సాహం నీలోనే వుంది, గుండె సవ్వడి వినిపించుకుంటే నీకే తెలుస్తుంది

# కాసులు కురిపించే కుసుమ సాగు !

**కుసుమ, ఒకే మొక్క అనేక ప్రయోజనాలను అందిస్తున్నది. ఔషధ రంగంలో పాటు నూనెగింజల పంటగానూ భారీ స్థాయిలో సాగవుతున్నది. ప్రస్తుతం కుసుమ నూనెకు గిరాకీ పెరగడంతో పాటు, వటి పూలకూ మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నది. వెరసి రైతు ఇంట... కుసుమ పంట కాసులు కురిపిస్తున్నది. రబీలో వరికి ప్రత్యామ్నాయంగానూ కనిపిస్తున్నది.**

**కు**సుమలోని ఔషధ గుణాల కారణంగా, ఈ నూనెను ఆయుర్వేదంలో వాడుతుంటారు. గతంలో రంగుల కోసం కూడా ఈ పంటను ఎక్కువగా సాగు చేసేవారు. అయితే మార్కెట్లోకి వివిధ రకాల మందులు రావడం, కృత్రిమ వర్ణాల వాడకం పెరగడంతో కుసుమ సాగు కుంటుపడింది. అంతేకాకుండా ముళ్ళతో కూడిన ఈ మొక్కలను సాగు చేయడానికి రైతులు కూడా నిరాసక్తత ప్రదర్శించారు. పంట కోతకు కూలీలు దొరకడం కూడా కష్టమయ్యేది. కానీ ఇప్పుడు వీటన్నిటికీ పరిష్కారం దొరికింది. యాంత్రికీకరణకు సంబంధించిన పరిశోధనలో వరికోత యంత్రంతోనూ కుసుమ పంటను కోయడం, నూర్చడం సాధ్యమేనని తేలింది. ముళ్లు లేని కుసుమ రకాలు కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధతో పాటు కుసుమలోని ఔషధగుణాలు, ఉపయోగాలపై అవగాహన పెరగడంతో ఈ పంట పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్నది.

**రకాలు :**

కుసుమలో టి.ఎస్.ఎఫ్-1, మంజీర,ఐ.ఎస్.ఎఫ్-764, నారి-6, డీ.ఎన్.హెచ్-185 తదితర రకాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఐ.ఎస్.ఎఫ్-764, నారి-6 రకాల్లో ముళ్లు ఉండవు. ఇవి పూల సేకరణకు ఎంతో అనుకూలంగా ఉంటాయి. డీ.ఎస్.హెచ్-185 హైబ్రిడ్ రకం నీటిపారుదల కింద సాగు చేసుకోవచ్చు. కుసుమ సాగు ఎకరానికి ఆరు నుంచి ఏడు క్వింటాళ్ళ దిగుబడిని ఇస్తుంది. ప్రస్తుతం క్వింటాల్ ధర 3500 రూపాయల నుంచి 4 వేల రూపాయల దాకా పలుకుతున్నది.

**విత్తే సమయం :**

అక్టోబర్ నెల రెండో పక్షం నుండి నవంబర్ మొదటి

---

భావించిన మీనా తన సామాజిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టేందుకు 2017లో మానునీ ఫౌండేషన్ పేరిటి ఓ సంస్థను ప్రారంభించారు. సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో తన సంస్థ చేపడుతున్న కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించారు. దీంతో..అనేకమంది సహాయం చేసేందుకు ముందుకు రావడంతో.. మీనా ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని మరింత పెద్ద ఎత్తున చేపడుతున్నారు.

భారత ప్రజల నుంచే కాకుండా.. వివిధ దేశాల నుంచీ ఈ సంస్థకు నిధులు అందుతున్నాయి. మీనా జన్మదినం పురస్కరించుకుని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధా మూర్తి రెండు లక్షల రూపాయల విలువైన శానిటరీ ప్యాడ్లను పంపించారు. అంతేకాకుండా.. అక్షయ్‌కుమార్ కూడా రెండు లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ ఏడాది హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు రూ. 9 లక్షలు సమకూర్చింది. ఇక కరోనా లాక్‌డౌన్ సమయంలోనూ ఆమె అనేక కార్యక్రమాలను చేపట్టి విధివంచితులకు అండగా నిలిచారు. ■

## మంచి దిగుబడులు !

**నూ**నె గింజల పంట అయిన కుసుమతో బహుళ ప్రయోజనాలున్నాయి. గతంలో ఎకరానికి 3-4 క్వింటాళ్ళ దిగుబడి రావడమే కష్టంగా ఉండేది. కానీ, ప్రస్తుతం అభివృద్ధి పరచిన రకాలతో ఎకరానికి 6-10 క్వింటాళ్ళ దిగుబడి వచ్చే అవకాశం ఉన్నది. ఖరీఫ్‌లో భారీ వర్షాల వల్ల ఇతర పంటలు దెబ్బతినే ప్రమాదం ఉన్నది. అలాంటి ప్రాంతాల్లో కుసుమను ప్రత్యామ్నాయంగా సాగు చేసుకోవచ్చు. అలాగే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు. తక్కువ నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లోనూ అధిక దిగుబడిని సాధించవచ్చు. ***- డా. సుధాకర్, తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త***

# అందాన్నే కాదు, ఆరోగ్యాన్నీ సంరక్షించే మల్లెపూలు!

**మ**ల్లెపూల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. సబ్బులు, తలనూనె, సౌందర్య సాధనాల్లో కూడా మల్లెపూలను వాడుతున్నారు. అలాగే సుంగంధ మొక్కల ద్రవ్యాలతో చేసే అరోమా థెరపీలోనూ మల్లె పూలను వాడతారు. కళ్లు అలసటగా ఉన్న సమయంలో మల్లెపూల రసంతో కంటిచుట్టూ మర్దన చేసుకుని పడుకుంటే ఉపశమనం లభిస్తుంది. అలాగే తాజా మల్లెలను మెత్తగా నూరి, తడిబట్టతో చుట్టి కళ్లమీద పెట్టుకుంటే, కళ్లలో నీరు కారడం, తడి ఆరిపోవడం వంటి సమస్యలను దూరం చేస్తుంది. నంపుసకత్వం, శీఘ్రస్కలన సమస్యల పరిష్కారానికి కూడా మల్లెపూలు ఉపకరిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. మల్లెపూల రసాన్ని, గులాబీల రసంతో కలిపి ముఖానికి రాసుకుంటే చర్మం మృదువుగా ఉంటుంది. చర్మానికి అవసరమయ్యే విటమిన్-సి మల్లెపూలలో పుష్కలంగా దొరుకుతుంది.



మల్లెల్లోని సువాసన మనసుకు ఆహ్లాదాన్ని ఇవ్వడమే కాకుండా తలనొప్పిని కూడా తగ్గిస్తుంది. మల్లెల కషాయంతో కళ్ల మంటలు, నొప్పులు తగ్గుతాయి. మల్లె పూలు, ఆకులతో కషాయం కాచి, వడగట్టి చల్లార్చాలి. అనంతరం రెండు వంతుల కషాయంలో ఒక వంతు నువ్వులనూనె, కొబ్బరినూనె, ఒక స్పూను బాదం నూనె కలపాలి. ఈ మిశ్రమంతో వారానికి రెండుసార్లు తలకు మర్దన చేస్తే ఉపశమనం లభిస్తుంది. కోపం, డిప్రెషన్ తదితర సమస్యలను దూరం చేసే స్వభావం మల్లెపూలకు ఉంది. సువాసన వెదజల్లే పూలను తల దిండు పక్కన పెట్టుకుని పడుకుంటే.. మనసు స్థిమితమై హాయిగా నిద్ర పడుతుంది. మధుమేహులు మల్లెపూలతో చేసిన టీ తాగితే మంచిది. రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించే గుణం వీటికి ఉంటుందట.

కొబ్బరినూనెలో మల్లెపూలను రోజంతా నానబెట్టి, తర్వాత కాచి వడగట్టాలి. చల్లారాక తలకు మర్దనా చేసుకుంటే జుట్టు కుదుళ్లకు పోషకాలు అందుతాయి. అదేవిధంగా కొబ్బరినూనెతో మల్లెపూల రసాన్ని కలిపి తలకు రాసుకుంటే మంచి సువాసన వస్తుంది. చుండ్రుతో బాధపడేవారు మల్లెపూల రసాన్ని మెంతులతో కలిపితలకు పట్టిస్తే మంచి ఫలితం ఉంటుంది. మొటిమల వల్ల వచ్చే మచ్చలు పోగొట్టడంలోనూ మల్లెలు ఉపకరిస్తాయి. మల్లెపూలతో చేసిన పలుఔషధాలు శరీరంపై ఏర్పడే కణితులనునివారిస్తాయని పరిశోధనల్లో తేలింది. మహిళలకు రుతుస్రావంలో తలెత్తే సమస్యలను కూడా ఇవి తగ్గిస్తాయట. అలాగే గర్భిణులకు సుఖప్రసవం అయ్యేందుకు ఇవి ఎంతో సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ■

---

పక్షంలోపు కుసుమను విత్తుకోవచ్చు. ఈ సమయంలో వాతావరణంలోని తక్కువ తేమ, తక్కువ ఉష్ణోగ్రతలు పంట ఎదుగుదలకు సాయపడుతాయి. ఎకరానికి నాలుగు కిలోల విత్తనం అవసరం అవుతుంది. విత్తడానికి ముందే కిలో విత్తనానికి థైరామ్ 3 గ్రా. లేదా బావిస్టిక్టో 1గ్రా. కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. రకాన్ని బట్టి కుసుమ పంట కాలం 120 నుంచి 135 రోజుల వరకు ఉంటుంది.

**పంట ప్రణాళిక :**

కుసుమను ఏక పంటగా లేదా అంతర పంటగానూ వేసుకోవచ్చు. అయితే ప్రతిసారీ ఒకే పొలంలో పండించడం కన్నా, పత్తి / కంది లాంటి పంటలతో మార్పిడి చేయడం వల్ల కుసుమను ఆశించే ఎండు తెగులును నివారించుకోవచ్చు. పెసర లాంటి స్వల్పకాలిక ఖరీఫ్ అపపరాల తర్వాత కుసుమ వేసుకోవడం లాభదాయకంగా ఉంటుంది. అధిక వర్షాలు ఉన్నప్పటికీ, కొద్దిపాటి క్షారత్వం గల సమస్యాత్మక భూముల్లోనూ కుసుమను పండించుకోవచ్చు. ■

# ఓఆర్ఎస్ కొంటున్నారా ? బహుపరాక్ !

ఐదేళ్ళ లోపు పిల్లల మరణాలకు కారణమయ్యే ప్రధాన రుగ్మతల్లో డయేరియా ఒకటి. ప్రతి వంద మంది పిల్లల్లో 13 మంది పిల్లల మరణాలకు డయేరియా కారణంగా ఉంటోంది. డయేరియాతో శరీరంలోని నీరు, లవణాల లోటు ఏర్పడడం మూలంగా మూర్ఛ, షాక్, కోమా, పేగు వాపు, పక్షవాతం మొదలైన సమస్యలతో పిల్లలు మరణానికి చేరువ అవుతూ ఉంటారు. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే డయేరియా మూలంగా కోల్పోయిన నీరు, లవణాలను సరైన మోతాదుల్లో పిల్లల శరీరాల్లో భర్తీ చేయాలి. ఇందుకోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతి పొందిన ఓఆర్ఎస్ ఫార్ములాలనే వాడుకోవాలి. వీటిలో గ్లూకోజు, సోడియం, పొటాషియం, క్లోరైడ్ మొదలైన లవణాలు ఉంటాయి. దీనిలో ఉండే గ్లూకోజ్, సోడియం శరీరంలో శోషణ చెందడానికి తోడ్పడే పరిమాణంలో పరిమితంగా మాత్రమే ఉంటుంది. ప్యాకెట్ మీద డబ్ల్యుహెచ్ఓ రికమెండెడ్ ఫార్ములా అనే గుర్తు కూడా ఉంటుంది. అయితే మందుల షాపుల్లో ఓఆర్ఎస్ పేరుతో దొరికే కొన్ని టెట్రాప్యాక్స్‌లో లవణాల మోతాదులు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఫార్ములాకు భిన్నంగా ఉంటున్నాయి.




**వేరే ఫార్ములా ఇస్తే...**

ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఫార్ములాకు బదులుగా మార్కెట్లో దొరికే ఇతర ఫార్ములాలను అందిస్తే సమస్య తగ్గకపోగా పెరిగిపోయే ప్రమాదం ఉంటుంది. డీహైడ్రేషన్ అదుపులోకి వచ్చి డయేరియా తగ్గాలంటే తక్కువ చక్కెర, ఎక్కువ సోడియం, పొటాషియంలు కలిగిన ఒఆర్ఎస్ అందించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఫార్ములాకు భిన్నంగా తయారయ్యే ఓఆర్ఎస్‌లలో అధిక మోతాదులో చక్కెర, తక్కువ మోతాదులో సోడియం, పొటాషియం ఉంటాయి. వీటిని ఇవ్వడం వల్ల విరేచనాలు అదుపు కాకపోగా విపరీతంగా పెరిగిపోతాయి. దాంతో డీహైడ్రేషన్ మరింత పెరిగి పరిస్థితి విషమిస్తుంది. ఇలా జరగకుండా ఉండాలంటే ఏవి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం పొందినవో, ఏవి పొందనివో తెలుసుకొని వినియోగించాలి.

**ఎఫ్ఎస్ఎస్ఏఐ పర్మిషన్‌తో...**

ఓఆర్ఎస్‌లను తయారు చేసే కొన్ని ఔషధ సంస్థలు 'ఫుడ్ అండ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' ఆమోదంతో ఓఆర్ఎస్‌ను తలపించే పానీయాలను తయారు చేస్తున్నాయి. ప్యాకెట్ల మీద 'ఓఆర్ఎస్'ఎల్, విఐటి'ఓఆర్ఎస్' అనే అయోమయానికి గురి చేసే లేబుళ్లతో రోగులను పక్కదారి పట్టిస్తున్నాయి. వైద్యులు ఓఆర్ఎస్ సూచించినప్పుడు ఫార్మసీలలో ఈ రకం పానీయాలనే రోగులు కొని వాడుకుంటున్న పరిస్థితి. కాబట్టి ఏది సరైన ఓఆర్ఎస్ పానీయమో, ఏది కాదో తెలుసుకోవడం అవసరం.

**ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం పొందినవి...**

వీటి మీద డబ్ల్యుహెచ్ఓ ఫార్ములా అని స్పష్టంగా ముద్రించి ఉంటుంది. దీని కోసం గమనించాలి. అవి : ఎలెక్ట్రాల్ వాలైట్, రాన్‌బాక్సీ ఒఆర్ఎస్, వాలైట్ ఒఆర్ఎస్, సిప్లా తయారీ ఒఆర్ఎస్ , ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్

**ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం పొందనవి...**

ఇవి ఫుడ్ అండ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆమోదం మాత్రమే పొంది ఉంటాయి.

**అవి :** ఒఆర్ఎస్ఎల్ (గ్రీన్ యాపిల్, యాపిల్, ఆరెంజ్, లెమన్), ఒఆర్ఎస్ఎల్ ప్లస్ (రెడీ టు సర్వ్), రెబాలాంజ్ విట్ ఓఆర్ఎస్.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

అన్ని ప్రయత్నాలూ ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు, కాని ప్రయత్నమే లేనిది ఏ ఫలితమూ రాదు కదా!

# కనే కష్టమే కాదు, కుటుంబ నియంత్రణ క్లేశమూ అమ్మలకే ...

**అ**మ్మా నాన్న... బిడ్డకు రెండు కళ్ళు. అమ్మ లాలిస్తుంది. నాన్న నడిపిస్తాడు. అమ్మ మంచి చెబుతుంది. నాన్న దారి చూపిస్తాడు. అమ్మానాన్నల అనుబంధంలోని ఈ సమన్వయమే బిడ్డకు అనురాగాన్ని రుచి చూపిస్తుంది. మరి ఈ సమన్వయం వారి మధ్య అన్ని విషయాల్లోనూ వుంటున్నదా? ఆమె కనియిచ్చిన బిడ్డను ఎత్తుకొని మురవడమేనా... లేక ఆమె బాధనూ, బరువునూ కొంతైనా పంచుకుంటున్నారా? తొమ్మిది నెలలు మోసి... అన్ని నొప్పులు, కోతలు అనుభవించి వారసుడిని అందించిన ఆమె రుణం పురుషుడు కొంచెమైనా తీర్చుకుంటున్నాడా? కనీసం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నుంచైనా ఆమెకు ఊరట ఇస్తున్నాడా? ఈ ప్రశ్నకు ' ఏపీ సామాజిక ఆర్థిక అధ్యయనం' యిస్తున్న సమాధానం అత్యంత నిరాశ కలిగించే విధంగా ఉంది.

పురుషులు చేస్తున్న అన్ని పనుల్లో మహిళలు పాలు పంచుకుంటున్నా... కనీసం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ భారాన్ని మహిళలకు తప్పించడానికైనా పురుషులు ముందుకు రావడం లేదని ఈ అధ్యయనం ఆక్షేపించింది. దానివల్ల ట్యూబెక్టమీలు లక్షల్లో ఉంటే, వాసెక్టమీలు వేలల్లోనే ఉంటున్నాయని పెదవి విరిచింది.

నిజానికి మహిళలతో పోల్చితే... పురుషులకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స నిర్వ హించడం తేలిక. అందుకు సిద్ధమయినవారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నది. వాసెక్టమీ చేయించుకుంటే ఇచ్చే 550 రూపాయల ప్రోత్సాహక నగదును 1100 రూపాయలకు పెంచింది.

ఇంత చేస్తున్నా, ఇవేమీ పురుషుల ఆలోచనా ధోరణిని మార్చలేకపోతున్నాయని సర్వే వివరించింది. లైంగిక సామర్థ్యం తగ్గుతుందని, శారీరక సుఖాన్ని కోల్పోతామన్న అపోహ పురుషుల్లో నెలకొనడమే దీనికి కారణమని తెలిపింది. దీనివల్ల మహిళలే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు సిద్ధపడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసింది.

సాధారణంగా రెండో బిడ్డ దగ్గర దంపతులు ఆగిపోతుంటారు. వారి అంగీకారంమీద వైద్యులు పురిటి మంచం పైనే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సను నిర్వహిస్తారు. అప్పటికి ప్రసవం నొప్పులే పూర్తిగా తగ్గవు. అంత పచ్చి ఒంటిపై మళ్ళీ ఆపరేషన్ అంటే... ఆమె పరిస్థితి దుర్భరంగా ఉంటుంది.

అయినా ఆ బాధనంతా మూగగా అనుభవించ వలసిందే. క్రమక్రమంగా పడిపోతున్న వేసెక్టమీల సంఖ్య మరింత ఆందోళన కలిగించే విషయం. ఉదాహరణకు 2010-11లో ట్యూబెక్టమీ చేయించుకున్న ప్రతి లక్షమంది స్త్రీలకుగాను 5000 మంది పురుషులు మాత్రమే వాసెక్టమీ చేయించుకున్నట్టు వైద్య గణాంకాలు చెబుతున్నాయి.

ఆ సంఖ్య రెండేళ్ళకే, అంటే 2013-14 నాటికి 2000కు (60 శాతం) పడిపోయింది. అదే సమయంలో ట్యూబెక్టమీ కేసులు ముమ్మరమయ్యాయి. 2010-11లో 3 లక్షల 22 వేల మంది మహిళలు ట్యూబెక్టమీ చేయించుకున్నారు. 2013-14 నాటికి స్వల్ప తగ్గుదల నమోదైంది. ఆ ఏడాది 2 లక్షల 94 వేల మందిచేయించుకున్నారు.

మరో విషయం ఏమిటంటే, మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం చాలా రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం. మహిళల్లో ఈ ఆపరేషన్లు విఫలమైన సందర్భాలు చాలా ఎక్కువ. అదే పురుషులకు సంబంధించి 90 శాతానికి పైగా విజయవంత మైనట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

కానీ ఈ వాస్తవాలు, గణాంకాలూ... ఏపీ పురుషుల్లో నాటుకుపోయిన అపోహలను తొలగించలేకపోతున్నాయి. ఇలాంటి పరిస్థితి గ్రామాల్లో ఉన్నదంటే కొంత అర్థం చేసుకోవచ్చు.

ఎందుకంటే వెనకబడిన సామాజిక జీవనం, నిరక్షరాస్యత అనేవి చైతన్యానికి ప్రతిబంధకంగా ఉంటాయి. కానీ పట్టణాలు, నగరాల్లోనూ దారుణమైన పరిస్థితులే ఉండటం ఆందోళనకరమని అధ్యయనం వ్యాఖ్యానించింది. ■

## వాళ్ళ ఇంటి లోపల ఎవరైనా టాయిలెట్ నిర్మించవచ్చు ప్రభుత్వ సబ్సిడీ మరియు రుణ సహాయంతో

- మరుగుదొడ్డిని నిర్మించుకునేందుకు ప్రభుత్వ సబ్సిడీ పొందండి
- ఎస్‌హెచ్‌జిలు/బ్యాంకులు/నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పొందండి
- మరింత సమాచారం కోసం, పంచాయతీ అధికారి/ప్రభుత్వ అధికారి/ఎన్‌జిఒను సంప్రదించండి



## పరిశుభ్రమైన గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, సంతోషకరమైన గ్రామం

- మరుగుదొడ్డి ఉపయోగించడం సౌలభ్యంగా ఉంటుంది
- పిల్లలు మరియు మహిళలకు భయం మరియు సిగ్గుపడవలసిన అవసరం లేదు
- వ్యాధుల వ్యాప్తిని నివారించండి
- పిల్లల చదువు లేదా కుటుంబ ఆదాయం ప్రతికూలంగా ప్రభావితం కావు

- రెండు గుంతల నిర్మించండి
- నీటి కనెక్షన్ ఇన్‌స్టల్ చేయండి
- సులభ లోన్ పొందండి
- మీ కుటుంబాన్ని సంతోషపెట్టండి



नाबार्ड

गाँव बढ़े >> तो देश बढ़े | www.nabard.org | /nabardonline | Taking Rural India >>Forward

नाबार्ड

# స్వచ్ఛత ఉద్యమం

రోజూ మరుగుదొడ్డి ఉపయోగించండి
మీ కుటుంబంలో ఆరోగ్యం మరియు
సంతోషం నింపండి



అభివృద్ధి
— కోసం —
పారిశుధ్యం
— నాబార్డ్ సౌజన్యంతో —
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి

## బహిర్భూమికి వెళ్ళడం అంటే మీ ఇబ్బందులను పెంచుకోవడమే:



జబ్బులు- అతిసారం, నీళ్ళ విరేచనాలు, కరోనా వైరస్ ఇన్ఫెక్షన్.



కాలుష్యం- భూమి కాలుష్యం, నీటి కాలుష్యం



మహిళలకు భయం మరియు సిగ్గు

## ఇంట్లో మరుగుదొడ్డి ఉండగా బహిర్భూమికి ఎందుకు వెళ్ళాలి?



నీటి కనెక్షన్ లేదా?



మరుగుదొడ్డి గుంత నిండిపోయిందా?



మరుగుదొడ్డికి మరమ్మతులు అవసరమా?

## పరిష్కారాలు సులభమైనవి:



మీ మరుగుదొడ్డి నీటి కనెక్షన్ పొందండి



మా మరుగుదొడ్డి జత గుంతలు నిర్మించుకోండి



అవసరమైతే మీ మరుగుదొడ్డి రెండు గుంతల మరుగుదొడ్డి నిర్మించండి



నీటి సదుపాయం కల్పించండి

MAHILA SADHIKARATHA
Publication Date: 01-11-2021; Posting Date: 05 & 06-11-2021

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23




ఆదివాసి గిరిజన ఎఫ్ పి సి, భూసంపద్ ఎఫ్ పి సి ప్రథమ వార్షిక మహాసభల దృశ్యాలు





రైతుబిడ్డ ఎఫ్ పి సి, సిరికొండ ఎఫ్ పి సి ప్రథమ వార్షిక మహాసభలు ... పలమనేరు ఎఫ్ పి ఓ వార్షిక మహాసభ





తిమ్మాజివాడి, కల్వరాయిలలో 'ధరణి' ధాన్యం సేకరణ కేంద్రాల ప్రారంభోత్సవాలు ... దండువారిపల్లిలో కర్నూలు జిల్లా రైతులు



బి కోటలో 'హార్సిలీ హిల్స్ '
ఎఫ్ పి సి కార్యాలయ ప్రారంభం



పాడిపంటలు ప్రాజెక్ట్ రైతులు, డైరెక్టర్ల
అవగాహన పర్యటన



కలకడలో రెడ్డెమ్మ ఎఫ్ పి ఓ
కార్యాలయం ప్రారంభం



జనగావ్ క్లస్టర్‌లోని రైతు వికాస్
ఎఫ్ పి సి డైరెక్టర్లకు శిక్షణ



ధరణి, ఆజీవ, ధీశాలి, జై కిసాన్
ఎఫ్ పి ఓల డైరెక్టర్లకు శిక్షణ



తిరుపతి పశువైద్య కళాశాలలో
పశువుల పెంపకంపై శిక్షణ

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089